ప్రజాశక్తి

గురువారం 20 నవంబర్ 2025

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

వేతనాల కోతపై కార్మికాగ్రహం

• 'చట్ట వ్యతిరేక సర్క్యులర్'పై స్టీల్ వర్కర్ల మండిపాటు • ప్లాంట్‌లోని అన్ని విభాగాల్లో నల్ల బ్యాడ్జీలతో నిరసన

ప్రజాశక్తి- ఉక్కునగరం

ఉత్పత్తితో జీతాలకు ముడిపెట్టడంపై విశాఖ స్టీల్‌ప్లాంట్ కార్మికులు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ నెల 15వ తేదీన ఇచ్చిన ఈ చట్ట వ్యతిరేక సర్క్యులర్‌ను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యాన ఉద్యోగులందరూ నల్ల బ్యాడ్జీలు పెట్టుకొని విధులు నిర్వహించి నిరసన తెలిపారు. యాజమాన్యం తక్షణమే ఈ సర్క్యులర్‌ను ఉపసంహరించుకోకపోతే కార్మికుల వ్యతిరేకతను చవిచూడాల్సి ఉంటుందని యూనియన్ నాయకులు హెచ్చరించారు. వేతన ఒప్పందంలో భాగంగా ఉద్యోగులకు ఇస్తున్న వేతనాలను ఉత్పత్తితో ఏవిధంగా ముడిపెడతారని స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి జె.అయోధ్యరామ్ యాజమాన్యాన్ని ప్రశ్నించారు. ఉద్యోగుల కృషి ఫలితంగా విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ 120 శాతం ఉత్పత్తిని నమోదు చేసిందని, రూ.వేల కోట్ల లాభాలతో నవరత్న హోదా సాధించిందని తెలిపారు. ఇతర స్టీల్‌ప్లాంట్ల కంటే తక్కువ కార్మికులు ఉన్నప్పటికీ అధికారులు రోజుకు

మిగతా 2లో..

దీపాలు వెలిగిస్తున్న భక్తులు

కనులపండువగా దీపోత్సవం

4

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు లోకనాథం, వేదికపై జగ్గునాయుడు, పైడిరాజు

వార్త మెయిన్‌లో...

ముఖ్యమంత్రి స్టీల్‌ప్లాంట్‌ను రక్షించకుండా.. కార్మికులపై నిందలు మోపడం దుర్మార్గం

జాతీయ లోక్ అదాలత్‌లో..

ఎక్కువ కేసులు పరిష్కారమవ్వాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : వచ్చేనెల 13వ తేదీన జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా చూడాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు సూచించారు. జిల్లా న్యాయ సేవా సదంలో మోటారు ప్రమాదాలు, బీమా క్లెయిములు, రవాణా సంబంధిత కేసులు ఎక్కువ సంఖ్యలో పరిష్కరించేందుకు అవసరమైన ఏర్పాట్లు, రాజీ కుదిర్చే విధానాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సన్యాసినాయుడు మాట్లాడుతూ, రాజీకి అవకాశం ఉన్న కేసులను గుర్తించి, కక్షిదారులకు లోక్ అదాలత్ ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించాలని అధికారులను ఆదేశించారు.

బల్క్ డ్రగ్ పార్క్‌ను రద్దు చేయాలి

▶ వార్త మెయిన్‌లో..

యశ్వంతపూర్ ఎక్స్‌ప్రెస్‌కు తృటిలో తప్పిన ప్రమాదం

▶ వార్త మెయిన్‌లో..

21 నుంచి కనకమహాలక్ష్మి మార్గశిర మాసోత్సవాలు

▶ వార్త 8లో..

అంబుజా సిమెంట్ రద్దుకు కౌన్సిల్‌లో తీర్మానం చేయాలి

▶ వార్త 3లో..



అన్నదాత సుఖీభవ చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, కలెక్టర్ హరేంధిరప్రసాద్

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

వార్త 5లో..

క్రిప్టో కరెన్సీ స్కామ్‌లో కీలక నిందితుడు అరెస్ట్

ప్రజాశక్తి -ఎంవిపి.కాలనీ : సైబర్ నేరగాళ్లపై ఉక్కుపాదం మోపుతున్న విశాఖపట్నం సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు ఈ నెల 11వ తేదీన కీలక నిందితుడిని అరెస్టు చేశారు. డిజిటల్ అరెస్ట్, క్రిప్టో ట్రేడింగ్, పెట్టుబడి మోసాలు, టాస్క్-బేస్డ్ పార్ట్‌టైమ్ ఉద్యోగాలు, వాట్సాప్ మోసాల ద్వారా బాధితుల నుండి దోచుకున్న డబ్బును మ్యూల్ అకౌంట్ల ద్వారా విత్‌డ్రా చేసి, ఆ మొత్తాన్ని క్రిప్టో కరెన్సీ రూపంలో సైబర్ నేరగాళ్లకు మార్చి సరఫరా చేస్తున్న వ్యక్తిని పట్టుకున్నారు. పోలీస్ అధికారులు అందించిన వివరాల ప్రకారం ఈ కేసు కు సంబంధించి జగిత్యాల జిల్లా, గొల్లపల్లికి చెందిన లక్కాకుల మనోజ్ (23)ను పోలీసులు అరెస్ట్ చేసి బుధవారం విశాఖ తీసుకొచ్చారు. క్రిప్టో ట్రేడింగ్ యాప్ అయిన బైనాన్స్ ద్వారా నిందితుడు యుఎస్‌డిటి (టెథర్) ట్రేడింగ్ చేసేవాడని తెలిపారు. అధిక కమీషన్ ఆశతో సోషల్ మీడియా ద్వారా పరిచయమైన వ్యక్తులతో పి2పి (పీర్-టు-పీర్) లావాదేవీలు చేసేవాడని పేర్కొన్నారు.

సైబర్ నేరగాళ్ల సూచనల

మిగతా 2లో..

ఎయులో ఒఎంఆర్ షీట్ల గందరగోళం

ఫలితాల్లో ఎబిగా చూపడంపై విద్యార్థి ఆవేదన

ప్రజాశక్తి -ఎంవిపి.కాలనీ: ఆంధ్రా యూనివర్సిటీ పరిధిలో పరీక్షల నిర్వహణలో చోటుచేసుకున్న ఓ తప్పిదం ఆలస్యంగా వెలుగు చూసింది. గౌరీ డిగ్రీ కళాశాలలో బిఎస్‌సి కంప్యూటర్స్ చదువుతున్న చిన్నం జియోల్ తన రెండో సెమిస్టర్ మ్యాథమెటిక్స్ పరీక్షకు హాజరైనప్పటికీ, ఫలితాల్లో అతడు గైర్హాజరైనట్టు చూపించారు. దీనిపై విచారణ కోరిన విద్యార్థికి నాలుగు నెలల తర్వాత విస్మయకర సమాధానం లభించింది. 2025 మే 12వ తేదీన కంచరపాలెంలోని ఒక ప్రైవేటు జూనియర్ కళాశాలలో జరిగిన రెండో సెమిస్టర్ పరీక్షల్లో సదరు విద్యార్థి మ్యాథమెటిక్స్ పరీక్షకు హాజరయ్యారు. తదనంతరం వెలువడిన ఫలితాల్లో ఆ పరీక్షకు అతడు గైర్హాజరైనట్టు చూపించడంతో విద్యార్థి కలవరపడ్డారు. ఈ విషయంపై స్పష్టత కోరుతూ విద్యార్థి 2025 ఆగస్టు 25న ఎయూ పరీక్షల విభాగ అధికారులను సంప్రదించారు. లిఖితపూర్వక రిప్రజెంటేషన్ ఇస్తే, విచారణ జరిపి చర్యలు



పరీక్షకు హాజరై సంతకం పెట్టిన షీటు

చేపడతామని, అధికారులు హామీ ఇచ్చారు. రెండు నెలలు గడిచి మరో సెమిస్టర్ పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో విద్యార్థి తిరిగి అధికారులను సంప్రదించగా, విచారణ అనంతరం వారు దిగ్భ్రాంతికరమైన విషయాన్ని తెలిపారు. ఈ విద్యార్థి మరొక వ్యక్తి ఒఎంఆర్ షీట్లో పరీక్ష రాశాడని అధికారులు పేర్కొన్నారు. అంతేకాకుండా, దీనిపై స్పష్టత కోసం ఆ పరీక్షా కేంద్రం సూపరింటెండెంట్‌ను యూనివర్సిటీకి తీసుకురావాలని విద్యార్థికే సూచించారు.

'తప్పు నాదైతే ఆ రోజే ఎందుకు చెప్పలేదు'

అధికారుల ఈ స్పందనపై విద్యార్థి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

'నాకు పరీక్షా కేంద్రంలో

మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

వేతనాల కోతపై కార్మికాగ్రహం

12 గంటలకు చొప్పున పనిచేయడం యాజమాన్యానికి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ఉత్పత్తి తీయడంలో ఉద్యోగుల పాత్ర కంటే యాజమాన్య పథకాలు, ప్రభుత్వ విధానాల పాత్ర ఎక్కువగా ఉంటుందన్నారు. ఉత్పత్తికి అవసరమైన రా మెటీరియల్ సమకూర్చడం, యంత్రాలను నిర్వహణకు సిద్ధం చేయడం, సరైన పథకం రూపొందించడంలో యాజమాన్య పాత్ర ముఖ్యమైనదని పేర్కొన్నారు. రా మెటీరియల్ సరఫరా చేయలేక, యంత్రాలకు మరమ్మతులు చేయక రోజూ ఉత్పత్తి నిలిచిపోతుందని, దీనికి యాజమాన్యానిదే బాధ్యత తప్ప ఉద్యోగులు బాధ్యులు కారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు యు.రామస్వామి, దేవుడు, నర్సింగరావు, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎయులో ఒఎంఆర్ షీట్ల గందరగోళం

ఇచ్చిన ఒఎంఆర్ షీట్లోనే పరీక్ష రాశాను. ఒకవేళ తప్పుడు ఒఎంఆర్ షీట్లో రాసి ఉంటే, ఆ రోజే ఇన్విజిలేటర్లు ఎందుకు తెలియజేయలేదు' అని ప్రశ్నిస్తున్నాడు. తన రిజల్ట్‌ను 'హోల్డ్‌లో' పెట్టకుండా, నేరుగా 'ఏబీ' చూపించడంపై అనుమానం వ్యక్తం చేశారు. తక్షణమే అధికారులుస్పందించి, తన పరీక్షా ఫలితాన్ని విడుదల చేసి న్యాయం చేయాలని కోరారు.

క్రిప్టో కరెన్సీ స్కామ్‌లో కీలక నిందితుడు అరెస్ట్

మేరకు, ఇతను తన స్నేహితులు శ్రీధర్, సిద్ధూ, రాకేశ్ తదితరులతో కలిపి పదుల సంఖ్యలో బ్యాంకు ఖాతాలు (మ్యూల్ అకౌంట్లు) తెరిచి, మోసం చేసిన డబ్బును క్రిప్టో కరెన్సీ రూపంలోకి మార్పుచేసి వారికి అందించేవాడని తెలిపారు. నిందితుడి ఖాతాల్లోకి సుమారు రూ.8 కోట్ల వరకు మోసపూరిత డబ్బు చేరినట్లు దర్యాప్తులో తేలిందని, ఆ మొత్తాన్ని క్రిప్టోగా మార్పుచేసి సైబర్ నేరగాళ్లకు చేరవేశారని వివరించారు. ప్రధాన నిందితులు దుబాయ్‌లో ఉన్నారని గుర్తించిన పోలీసులు, వారి కోసం (లుక్ అవుట్ సర్క్యులర్ జారీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

ఎన్‌కౌంటర్‌పై సందేహాలు : జెవి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : అల్లూరి జిల్లా మారేడుమిల్లి మండలంలో జరిగిన ఎన్‌కౌంటర్‌పై సందేహాలున్నాయని మార్క్సిస్టు అధ్యయన కేంద్రం కన్వీనర్ జెవి.సత్యనారాయణ మూర్తి పేర్కొన్నారు. మావోయిస్టు పార్టీ నాయకుడు హిడ్మా, అతని సహచరి రాజే సహ ఆరుగురు మావోయిస్టులు మరణించారని, బుధవారం మరో ఏడుగురు మృతిచెందారని, 50 మంది మావోయిస్టులను అరెస్టు చేసామని పోలీసులు ప్రెస్ మీట్‌లో చెప్పిన అంశాలను ఖండిస్తూ గురువారం అల్లిపురం సిపిఐ కార్యాలయంలో పౌర,ప్రజా సంఘాల వేదిక ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెవి.సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ, పోలీసులు చెబుతున్న దానిలో వైరుధ్యం ఉందన్నారు. 15 రోజుల నుంచి ఏలూరు దగ్గర గ్రీన్ సిటీలో మావోయిస్టులు ఉన్నట్లు తెలిసిందని, వారిని అరెస్టు చేశామని చెప్పారని తెలిపారు. మంగళ, బుధవారం ఎన్‌కౌంటర్ల 13 మంది మృతిచెందినట్లు చెబుతున్నారని, పట్టుకున్నవారినే చంపేశారనే అనుమానం ఉందని ఆరోపించారు. కార్పొరేట్లకు దేశ సంపదను దోచి పెట్టడానికి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తేదీ ప్రకటించి మరీ మావోయిస్టులను అంతం చేస్తోందని తెలిపారు.

10వ రోజుకు టిట్టిభ సత్యాగ్రహం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : మాతృభాష రక్షణ కోసం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద సాగుతున్న టిట్టిభ సత్యాగ్రహం బుధవారం నాటికి 10వ రోజుకు చేరింది. పలువురు కవులు, కళాకారులు, భాషాభిమానులు దీక్షలో పాల్గొని మాతృభాష ప్రతిజ్ఞ చేశారు. తెలుగుదండు అధ్యక్షుడు పరవస్తు సూరి మాట్లాడుతూ, మన మాతృభాష మీద, ఈ దేశవాళీ పాలకుల పెత్తనమేంటని ప్రశ్నించారు. ఈ రోజు దీక్షా వేదికకు మద్దతుగా, విశాఖ గాయనీ గాయకుల సంఘ సభ్యులు విచ్చేసి తెలుగు పాటలతో 'తెలుగుతల్లి'కి నీరాజనాలు సమర్పించారు.

ఘనంగా జాప్ వార్షికోత్సవం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : జర్నలిస్టు అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (జాప్) 33వ వార్షికోత్సవాన్ని 39వ వార్డులోని శ్రీ స్వామి వివేకానంద అనాథ వృద్ధుల ఆశ్రమంలో నిర్వహించారు. జాప్ విశాఖ శాఖ అధ్యక్షులు కెఎం.కీర్తన్ ఆధ్వర్యంలో ముందుగా కేక్ కట్ చేశారు. వృద్ధులకు పండ్లను పంపిణీ చేశారు. ఆశ్రమంలో ఉన్న వృద్ధులకు మధ్యాహ్నం అన్నదానం చేశారు.

స్టీల్‌ప్లాంట్‌లో ఉత్పత్తితో కూడిన జీతం ఉత్తర్వులు రద్దు చేయాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : విశాఖ స్టీల్ ప్లాంట్ ఉద్యోగులకు ఉత్పత్తితో కూడిన వేతనాలు చెల్లిస్తామంటూ ఇచ్చిన ఉత్తర్వులను తక్షణ రద్దు చేయాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి జిఎస్‌జె అచ్యుతరావు డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ బుధవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఎఐటియుసి జిల్లా సమితి ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విశాఖ ఉక్కు పరిశ్రమ నిప్పుల కొలిమి (బ్లాస్ట్ ఫర్నేస్) దగ్గర పనిచేస్తూ 110 శాతం ఉత్పత్తి చేసిన కార్మికులను సోమరిపోతులని చంద్రబాబు నిందించడం ఎవరి ప్రయోజనాల కోసమని ప్రశ్నించారు. విశాఖ ఉక్కు పరిశ్రమకు సొంత గనులు లేకుండా చేసింది కాక, ప్రైవేటు మిట్టల్ కంపెనీ కోసం సొంత గనులు అడుగుతున్నారని దుయ్యబట్టారు. విశాఖ ఉక్కు పరిశ్రమ కోసం కేంద్ర ప్రభుత్వం రూ.5 వేలు పెట్టుబడి పెడితే, స్టీల్‌ప్లాంట్ రూ.58 వేల కోట్లు తన లాభాల నుండి డివిడెండ్లు, పన్నుల రూపంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెల్లించిందని, అలాంటప్పుడు విశాఖ ఉక్కు పరిశ్రమ తెల్ల ఏనుగు ఎలా అవుతుందో చంద్రబాబు చెప్పాలని నిలదీశారు. తెలుగు ప్రజల ఆత్మాభిమానాన్ని చంద్రబాబు ఢిల్లీ దొరల వద్ద తాకట్టు పెట్టడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి నాయకులు ఎం.మన్మథరావు, బూసి వెంకటరావు, ఎస్‌కె రహిమాన్, జె.రామకృష్ణ, జి.వామనమూర్తి, కె.సత్యాంజనేయ, కసిరెడ్డి సత్యనారాయణ, ఎస్ఎం.మౌలాలి, కె.సత్తిబాబు, పి.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతులైన పిల్లలతోనే దేశ ప్రగతి సాధ్యం

సీనియర్ సివిల్ జడ్జి సన్యాసినాయుడు

ప్రజాశక్తి -ఎంవిపికాలనీ: ఆరోగ్యవంతులైన పిల్లలతోనే దేశప్రగతి సాధ్యపడుతుందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. బాలల వారోత్సవాలను పురస్కరించుకుని బుధవారం చైల్డ్ రైట్స్ అవేర్‌నెస్ ఫోరం, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, ఆయుర్జీవ ఎన్‌జిఒ, మెడికవర్ ఆసుపత్రి, స్మార్ట్ సిటీ కన్స్యూమర్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ సమన్వయంతో ఎంవిపి.కాలనీలోని ప్రభుత్వ మత్స్యకార పాఠశాల విద్యార్థులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి సన్యాసినాయుడు ప్రారంభించి మాట్లాడుతూ నిష్ణాతులైన పిల్లల వైద్య నిపుణుల పర్యవేక్షణలో విద్యార్థులకు వివిధ వైద్య పరీక్షలను నిర్వహించడం అభినందనీయమని అన్నారు. పండంటి ఆరోగ్యానికి ఉపయుక్త సూత్రాలు పేరుతో రూపొందించిన కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. చైల్డ్ రైట్స్ అవేర్నెస్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ గొండు సీతారాం మాట్లాడుతూ బాలల వారోత్సవాల్లో భాగంగా ఇప్పటికే ప్రజల్లో అవగాహన కల్పించే వివిధ కార్యక్రమాలు నిర్వహించామని చెప్పారు. కార్యక్రమంలో ఆయుర్జీవ ఎన్జీఓ సంస్థ ఫౌండర్ ఎస్.సుబ్బలక్ష్మి, స్మార్ట్ సిటీ కన్స్యూమర్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ వ్యవస్థాపక కార్యదర్శి పై.భాస్కరరావు, మెడికవర్ ఆస్పత్రి పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ ప్రియాంక, డాక్టర్ తులసి తదితరులు పాల్గొన్నారు.

కూచిపూడి నర్తకి సుపర్ణ దత్తుకు సత్కారం

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ: 50 ఏళ్లు పైబడిన సీనియర్ సిటిజన్ల ప్రతిభను ప్రోత్సహించేందుకు పనిచేస్తున్న డిజిటల్ వేదిక 'ఖ్యాల్' యాప్ నిర్వహించిన 50 వేడుకల గ్రాండ్ ఫినాలేలో విశాఖపట్నం వాసి, ప్రముఖ కూచిపూడి నర్తకి సుపర్ణ దత్తు ప్రత్యేక సత్కారాన్ని అందుకున్నారు. దేశవ్యాప్తంగా నిర్వహించిన ప్రతిభావంతుల ఎంపికలలో సుపర్ణ దత్తు నృత్య రంగంలో మొదటి 10 మంది ప్రతిభావంతులలో ఒకరిగా నిలిచారు. ఈ నెల 15, 16 తేదీల్లో జరిగిన ఈ గ్రాండ్ ఫినాలే వేడుకలో సుపర్ణ దత్తుకు నగదు పురస్కారం, జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా సుపర్ణ దత్తు మాట్లాడుతూ, 'దేశ వ్యాప్తంగా నిర్వహించిన ఖ్యాల్ వేడుకలో పాల్గొని, మొదటి 10 మందిలో నిలవడం ఎంతో అదష్టంగా భావిస్తున్నానన్నారు.

అతిపెద్ద 3డీ కాంక్రీట్ ప్రింటెడ్ మిలిటరీ ఆర్చ్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ: హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ డీప్‌టెక్ సంస్థ సింప్లిఫోర్జ్ ఐఐటి హైదరాబాద్ భాగస్వామ్యంతో దేశంలోనే మొట్టమొదటి, అతిపెద్ద 3డీ కాంక్రీట్ ప్రింటెడ్ మిలిటరీ ఇన్సిగ్నియా ప్రవేశ ద్వారాన్ని (ఆర్చ్) ఆవిష్కరించింది. విశాఖపట్నంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కల్నల్ అఖిల్ సింగ్ చారక్ మాట్లాడుతూ, ఈ భారీ నిర్మాణం, సింప్లిఫోర్జ్ సంస్థ అత్యాధునిక రోబోటిక్ ఆర్మ్ ఆధారిత 3డీ కాంక్రీట్ ప్రింటింగ్ సాంకేతికత ద్వారా నిర్మించినట్లు తెలిపారు. రక్షణ రంగ నిర్మాణాలలో ఆవిష్కరణలకు, ఇది ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుందన్నారు. ఈ ప్రాజెక్టును డిజైన్ అభివృద్ధిని ఐఐటి హైదరాబాద్‌లోని ప్రొఫెసర్ కెవిఎల్.సుబ్రహ్మణ్యం (హెచ్ఎజీ), సింప్లిఫోర్జ్ కంపెనీ భాగస్వామ్యంతో చేపట్టారు. ఫైజాన్ చౌదరి (ఫౌండర్ సిఒఒ, సింప్లిఫోర్జ్) అభివృద్ధి భాగస్వామిగా వ్యవహరించారు.

ఇగ్నోలో 40వ వ్యవస్థాపక దినోత్సవం



ప్రజాశక్తి -ఎంవిపి.కాలనీ: ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) దేశవ్యాప్తంగా నవంబరు 19వ తేదీన 40వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించింది. విశాఖపట్నం ఇగ్నో ప్రాంతీయ కేంద్రంలో సీనియర్ ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ గోనిపాటి ధర్మారావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాజీ ప్రధానమంత్రి కీర్తిశేషులు ఇందిరా గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం డాక్టర్ ధర్మారావు మాట్లాడుతూ, నాలుగు దశాబ్దాలుగా భారతదేశంలో దూరవిద్యకు ఇగ్నో మార్గదర్శనం చేస్తోందన్నారు. ఉన్నత విద్యను సామాన్యులకు చేరువ చేయడంలో, నాణ్యతలో రాజీ పడకుండా లక్షలాది విద్యార్థులకు తక్కువ ఫీజులతో ఉన్నత విద్యను అందించడంలో ఇగ్నో పాత్ర గణనీయమైనదని పేర్కొన్నారు. ఇగ్నో అదనపు సంచాలకులు డాక్టర్ ఇ.కృష్ణారావు ,ఇగ్నో ఉద్యోగులు పాల్గొన్నారు.

రెవెన్యూ వసూళ్లపై దృష్టి : జివిఎంసి కమిషనర్

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ: జివిఎంసి పరిధిలోని ఆస్తి, ఖాళీ జాగా పన్నుల వసూలపై ప్రత్యేక దృష్టి సారించి పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్ జివిఎంసి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన జివిఎంసి ప్రధాన కార్యాలయంలో అదనపు కమిషనర్ డివి.రమణమూర్తి, డిసి (ఆర్) ఎస్.శ్రీనివాసరావు, జోనల్ కమిషనర్లు, రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జివిఎంసి కమిషనర్ మాట్లాడుతూ, 4 నెలల్లో ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున ఆస్తి, ఖాళీ జాగా పన్నులతో పాటు పాత బకాయిలు, నీటి చార్జీల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించి వసూలు చేయాలని ఆదేశించారు. పన్నులు చెల్లింపునకు ప్రత్యేకంగా అదనపు కౌంటర్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

BEFORE THE HONOURABLE DEPUTY REGISTRAR OF CHITS, AT :: VIJAYAWADA
Arbitration Claim Petition No. 84/2025

Between:-
Kapil Chits (Kosta) Pvt. Ltd,
Rep. By it's Assistant Divisional Manager,
Governorpeta Branch, Vijayawada.
...Disputant
And
Adapa Lakshminarayana Rao & Others
...Opponents

Notice to Opponent No. 3
Gandreti Appala Raju, S/o. Ramulu, R/o. H. No. 60-29-80, Janatha Colony, Near Prabhudaya Pan Shop, Malkapuram, Visakhapatnam, Visakhapatnam District.
(Opponent No. 3)

Please take notice that the above Claim Petition had filed for recovery of claim amount and the Honourable Deputy Chit Registrar ordered notice to you and posted the case to 28-11-2025 for your appearance. So you are here by requested to appear before the office of Honourable Deputy Registrar of Chits Vijayawada, D. No. 55-6-7A, Opposite to Priya Childeren Hospital, Pantakaluva Road, Maruthi Colony, Patamata, Vijayawada-520010 on **28-11-2025** at **11-30** A.M. in person or through your Advocate, failing which the matter will be decided in your absence.
(By order of the Honourable Deputy Registrar)
Hearing Date: 28-11-2025
A. Prasoon Kumar,
Advocate
Vijayawada

మహారాజశ్రీ యలమంచిలి ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
ఐ.ఎ.నెం. 855 / 2025
ఒ.యస్.నెం.218 / 2020

బిట్వీన్:
నవర నాగమణి .....వాది
అండ్:
పరసవేది శరభలింగాచారి & 6 Others
... ప్రతివాదులు

4వ ప్రతివాదికి దావా సమను
సింహాద్రి కనక, భర్త రవి
తండ్రి లేటు బ్రహ్మం, 28 సం॥లు,
గృహిణి, వినాయకుడిగుడి వీధి,
శ్రీహరిపురం, గాజువాక,
విశాఖపట్నం జిల్లా.

పై నెంబరు దావాలో శ్రీకోర్టు వారు పంపిన సమన్లు మీరు అందుకోనందున పై కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **తే: 11-12-2025దికి** వాయిదా వేసియున్నారు. కావున ఆరోజు **ఉదయం 10-30 ని॥లకు** మీరు స్వయంగా గాని లేక మీ తరపున లాయరుగారు గాని పైకోర్టులో హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనిచో కోర్టు వారు మీపరోక్షమున పై దావా తీర్మానించబడదురు.

JVBSR శాస్త్రి
యలమంచిలి అడ్వకేట్, యలమంచిలి
తే:17-11-25 సెల్: 98488 35323

IN THE HONOURABLE COURT OF THE M.A.C.T - CUM- 4th ADDITIONAL DISTRICT JUDGE AND SPECIAL JUDGE TRIAL UNDER SG & ST CASES AT SRIKAKULAM
M.V.O. P. NO:183/2024

Between:
Jana Krishna. ----Petitioner
And:
Govvada Tulasi Das & Others
----Respondents

To,
R-1: Govvada Tulasi Das, S/o Papa Rao, R/o Door No. 36-94-394/1/B, Jagajevan Nagar, Kancharapalem Visakhapatnam.

NOTICE

As the notice sent to you for your appearence before the Honourable Court on several occations returned on found. The Honourable Court ordered notice to you by way of substituted Service Hence you are here by informed that the above matter sands posted on **27-11-2025** your appearence before the above court either in persion or through advocate by **10:30 A.M.** It you fail to appear as aforesaid, the above matter will be decided in your absence
(By order of the Honourable Court)

Srikakulam
19-11-2025.

D. NEELANNAIDU
ADVOCATE,
SRIKAKULAM,
CELL NO. 9441439673.

రేకుల షెడ్డు తొలగింపులో ఉద్రిక్తత

ప్రజాశక్తి - భీమునిపట్నం : జివిఎంసి మూడో వార్డు కృష్ణా కాలనీ, యోగాశ్రమం వెనుక ప్రభుత్వ స్థలంలో రేకుల షెడ్డు తొలగిస్తుండగా ఉద్రిక్తత చోటు చేసుకుంది. బుధవారం రెవెన్యూ అధికారులు ప్రొక్లెయినర్‌తో ఇంటి షెడ్డు తొలగింపునుస్థానికులు ఎన్ అప్పల రాజు, అతని కుటుంబ సభ్యులు అడ్డుకున్నారు. అంతటితో ఆగకుండా బాధితుడు అప్పల రాజు, వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను శరీరం పై వేసుకుని ఆత్మ హత్యకు ప్రయత్నించాడు వెంటనే కుటుంబ సభ్యులు, స్థానికులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా బాధితుడు అప్పలరాజు మాట్లాడుతూ 60 చదరపు గజాల స్థలంలో కమ్మల ఇళ్లు నిర్మించుకుని కుటుంబంతో నివాసం ఉంటున్నామని, కమ్మల ఇంటిపై రేకుల షెడ్డు వేస్తుండగా తొలగించడం అన్యాయమని వాపోయారు. ఉద్రిక్తత నడుమ ఇంటి షెడ్డు తొలగింపును అర్ధాంతరంగా రెవెన్యూ అధికారులు నిలిపివేశారు ఈ స్థలంపై సిడిపిఒ శ్రీదేవి ఫిర్యాదుతో తొలగిస్తున్నట్లు ఎంఆర్‌ఐ శ్రీదేవి తెలిపారు.

తలపై కొట్టడంతో వ్యక్తి మృత్యువాత

ప్రజాశక్తి- సీతమ్మధార.: డైమండ్ పార్క్‌లో మద్యం మత్తులో కర్రతో బుర్రపై కొట్టడంతో వ్యక్తి మృతి చెందాడు. సిఐ ఉమాకాంత్ తెలిపిన వివరాలివి. డైమండ్ పార్క్ సమీపంలో చిరంజీవి, లక్ష్మణ్‌రెడ్డి, హేమంత్ ముగ్గురూ భిక్షాటన చేసి జీవిస్తున్నారు. బుధవారం దాతలు ఇచ్చిన ఆహారపొట్లాలను తీసుకుని డైమండ్ పార్క్‌లో కూర్చుని భోజనం చేశారు. లక్ష్మణ్‌రెడ్డి, చిరంజీవికి చిన్నగొడవ జరగడంతో పార్క్‌లో పడుకున్న సమయంలో చిరంజీవిని కర్రతో కొట్టడంతో తీవ్ర గాయాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. నిందితుడు లక్ష్మణ్‌రెడ్డిని అదుపులోకి తీసుకున్న పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టెన్నిస్ క్రీడాకారుడు గురువుల రెడ్డి హఠాన్మరణం

ప్రజాశక్తి -తగరపువలస : తగరపువలసకు చెందిన జాతీయ టెన్నిస్ క్రీడాకారుడు బొర గురువులు రెడ్డి. (70) బుధవారంగుండె పోటుతో మృతి చెందారు. విశాఖ జిల్లాలో 50 ఏళ్లుగా టెన్నిస్ క్రీడలో జాతీయ, రాష్ట్ర స్థాయిలో అనేక టోర్నీలలో ప్రతిభ చూపిన

గురువులురెడ్డి

గురువులురెడ్డి, పలు టెన్నిస్‌క్లబ్‌లకు కోచ్‌గా వ్యవహరించారు. గురువులురెడ్డి మరణవార్త క్రీడలకు తీరనిలోటని భీమిలికి చెందిన ప్రియమిత్రుడు మైళ్ళపల్లి షణ్ముఖరావు కన్నీరు మున్నీరయ్యారు. పి. సుందర్‌సింగ్, లాయర్ వెంకటేష్, టెన్నిస్ క్రీడాకారులు సంతాపం తెలిపారు.

అంబుజా సిమెంట్ పరిశ్రమ రద్దుకు కౌన్సిల్‌లో తీర్మానం చేయాలి

ప్రజాశక్తి -గాజువాక : పెదగంట్యాడ వద్ద అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ రద్దుకు ఈనెల 21న జరగనున్న జివిఎంసి కౌన్సిల్‌లో తీర్మానం చేయాలని సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి గంగారావు డిమాండ్ చేశారు. అంబుజా సిమెంట్‌పై ప్రజాభిప్రాయమే తన నిర్ణయమని చెప్పుకుంటున్న గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు దీనిపై మేయర్‌కు లేఖరాయాలని డిమాండ్ చేశారు. బుధవారం నడుపూరులో పెదగంట్యాడ అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ వ్యతిరేక కమిటీ ఆధ్వర్యంలో సమావేశంలో మాట్లాడుతూ, గతంలో ఇదే అంశాన్ని కౌన్సిల్‌లో పెట్టి తీర్మానించాలని తాను ప్రతిపాదిస్తే అజెండాలో లేకుండా తీసేశారన్నారు. దీనిపై కౌన్సిల్‌లో తీర్మానించి నివేదిస్తే ఏర్పాటుకు అవకాశం ఉండదన్నారు. పెదగంట్యాడ అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటైతే గాజువాక పారిశ్రామిక ప్రాంతం నాశనమౌతుందని, విషయం తెలిసినా, ప్రజల ఆరోగ్యం, ప్రాణాలు పట్టనట్లు వ్యవహరించడం దుర్మార్గమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు కార్మికులంటే చిన్నచూపని ఇటీవల స్టీల్‌ప్లాంట్ కార్మికులను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలే నిదర్శనమన్నారు. స్టీల్‌ప్లాంట్‌తోనే విశాఖ పురోభివృద్ధి సాధించిందని, దీనికిఅందులో పనిచేసిన కార్మికుల కష్టమే

మాట్లాడుతున్న సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి. గంగారావు

కారణమన్నారు. పెట్టుబడుల పేరుతో విశాఖ నగరాన్ని అమ్మేయాలని చూస్తున్న కూటమి ప్రభుత్వం చర్యలకు వ్యతిరేకంగా ప్రజలంతా సంఘటితమై పోరాటం చేయాలన్నారు. ఫ్యాక్టరీ వ్యతిరేక కమిటీ నాయకులు ఎన్.రామారావు మాట్లాడుతూ, 21న కౌన్సిల్‌లో సిమెంట్ ఫ్యాక్టరీ రద్దు డిమాండ్‌తో గాజువాక నుంచి నిర్వహించే బైక్‌ర్యాలీ జయప్రదం చేయాలన్నారు. త్రినాథస్వామి అధ్యక్షతన సమావేశంలో కమిటీ నాయకులు కె.సత్యనారాయణ, నమ్మి రమణ, డి వెంకట్రావు, బంగారు నాయుడు, కెఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కిడ్నీ రాకెట్ బాధితులకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి-ఆనందపురం : కిడ్నీ రాకెట్ బాధితులకు ప్రభుత్వం తరపున తగిన సాయం అందించి న్యాయం చేయాలని వైసిపి భీమిలి సమన్వయకర్త మజ్జి చిన్నశ్రీను కోరారు. బుధవారం జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కిడ్నీ రాకెట్ వలలో చిక్కి వెల్లంకి పంచాయతీ బొడ్డపాలెం గ్రామానికి చెందిన సాడి యమున ఇటీవల మృతి చెందిందన్నారు. ఇదివరకే తండ్రిని కోల్పోయిన ఆమె తొమ్మిదేళ్ల కొడుకు అనాథగా మారిన నేపథ్యంలో అతడిని ప్రభుత్వపరంగా ఆదుకోవాలని కోరారు. కిడ్నీ రాకెట్ ముఠాపై సమగ్ర విచారణ జరిపి చర్యలు చేపట్టాలన్నారు. మండల పార్టీ అధ్యక్షులు బంక సత్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకట్రావు, మాజీ సర్పంచ్ వెంకటరమణ, రాము, సాడి అప్పారావురెడ్డి పాల్గొన్నారు.

వైసిపి సంతకాల సేకరణ

ప్రజాశక్తి- మాధవధార : వైద్యకాలేజీల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా జివిఎంసి 51వ వార్డు కళింగనగర్‌లో వైసిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు 51వ వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి సంతకాల సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో పొన్నాడ అప్పారావు, బుడుమూరు తిరుమలరావు, మెట్ట దమయంతి, ఎద్దు పైడి రాజు, కింతల వరాహలరాజు, వెంకటరమణ, చిన్నారావు, భాను చందర్, గణేష్, సాదు, ఎర్ని బాబు పాల్గొన్నారు

సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గం 50వార్డు మాధవధార 48ఎ బస్‌స్టాప్ వద్ద స్థానిక కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ ఆధ్వర్యంలో కోటిసంతకాల సేకరణ, రచ్చబండ నిర్వహించారు. వైసిపి జిల్లా

సంతకాల సేకరణలో వైసిపి కార్పొరేటర్ వెంకటరమణ

అధ్యక్షులు కె.కె రాజు వార్డు అధ్యక్షులు లాలంవేణు గోపాలస్వామి, అంబటి శైలేష్, శివరాం, సనపల నారాయణస్వామి, పాతపట్నం రామ్మోహన్, పైడి శ్రీనివాసరావు, బగాది విజయ్ కుమార్, బగాది శ్రీరామ్ మూర్తి, దవళ నారాయణరావు పాల్గొన్నారు..

రైతు శ్రేయస్సుకు ప్రాధాన్యత

ప్రజాశక్తి-తగరపువలస : భూసారం పెంపు, వ్యవసాయ ఖర్చుల తగ్గింపు, పరస్పర సహకారాన్ని అందించడంద్వారా రైతులకు చేయూతనిచ్చే లక్ష్యంతో దేశంలోనే తొలిసారిగా రైతు సమ్మి పద్ధతిని బుధవారం మజ్జిపేటలో కర్షక దేవోభవ మిషన్ జాతీయ చైర్మన్ డాక్టర్ ఆదారి కిశోర్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కర్షక దేవోభవ పేరుతో ప్రత్యేక ఎఫ్‌పిఒ ఏర్పాటుచేసి సాగు, రైతుల అభివృద్ధికి ప్రత్యేక కార్డు ద్వారా ట్రాక్టర్లు, వ్యవసాయ ఉపకరణాలు, కిరాణా వస్త్రాలను తక్కువ ధరలకు రైతు కుటుంబాలకు అందిస్తామన్నారు. పోటీ పరీక్షలకు ఉచితశిక్షణనిస్తామన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు ఎ..మోహనరావు, ప్రకాష్, మన్మధరావు, శ్యామల, భాను, అమ్మాజీ .సంధ్య, వెంకట్ పాల్గొన్నారు

స్టీల్ కాంట్రాక్ట్ కార్మికులకు త్రిఫ్ట్ సాయం

ప్రజాశక్తి -గాజువాక : స్టీల్ ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికులకు త్రిఫ్ట్ అనేక విధాలా ఆదుకుంటుందని, స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ సిఐటియు ప్రధాన కార్యదర్శి నమ్మి రమణ అన్నారు. త్రిఫ్ట్ సొసైటీ సభ్యత్వం కలిగి, ఇటీవల మృతి చెందిన స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ.లక్ష చొప్పున ఆర్థికసాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సభ్యులకు తక్కువ వడ్డీకే రుణాలు మంజూరు ద్వారా స్టీల్‌కాంట్రాక్ట్ కార్మికులకు త్రిఫ్ట్ సొసైటీ చేదోడుగా నిలుస్తోందన్నారు. రూ. 30 లక్షల నికర లాభాలతో దూసుకెళ్తున్న

చెక్కును అందజేస్తున్న నమ్మి రమణ.

త్రిఫ్ట్ సొసైటీని మరింత పురోభివృద్ధిపథంలో నడిపేందుకు సభ్యులు సహకరించాలన్నారు. కార్యక్రమంలో పాలకవర్గ సొసైటీ కార్యదర్శి పి.నారాయణరావు డైరెక్టర్లు శ్రీనివాసరావు, శశిభూషణ్ రావు, కృష్ణ పాల్గొన్నారు.

రిక.నెం.317/2025/ఎ/ తేది.19/03/2025

తహశీల్దార్ వారి కార్యాలయం గోపాలపట్నం

పత్రికా ప్రకటన

గోపాలపట్నం మండలం, కప్పరాడ గ్రామ కాపురస్తురాలు శ్రీమతి పిల్లా నళిని తండ్రి పిల్లా సూర్యనారాయణ, ఇంటి నెం: 39-6-28/9, అభయ్ రెసిడెన్సీ, ఫ్లాట్ నెం: 204, మురళినగర్, గోపాలపట్నం మండలం, విశాఖపట్నంనందు ఈ క్రింది పట్టికలో తెలిపిన స్థలమునకు నిరభ్యంతర ధృవీకరణ పత్రము (NOC) మంజూరు చేయవలసినదిగా కోరియున్నారు.

గ్రామం పేరు	సర్వే నెం	విస్తీర్ణము
ఇంటి నెం : 39-6-28/9, కప్పరాడ గ్రామం	9/5 A భాగం	35.19 చ.గజాలు (703.72 చ.గజాలు Undivided

పైన తెలిపిన భూమికి నిరభ్యంతర దువీకరణ పత్రము మంజూరు చేయుటకు ఎవరికైనా ఎటువంటి అభ్యంతరములు ఉన్నచో, ఈ ప్రకటన వెలువడిన 15 దినములులోగా శ్రీ జాయింటర్ మరియు కాంపిటేంట్ అథారిటీ, అర్బన్ ల్యాండ్ సీలింగ్, కలెక్టర్ కార్యాలయము, విశాఖపట్నం వారికి మరియు శ్రీ తహశీల్దార్, గోపాలపట్నం వారికి లిఖిత పూర్వకముగా తెలియజేయవలసినదిగా కోరడమైనది.

తహశీల్దార్,
గోపాలపట్నం మండలం, విశాఖపట్నం

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

ప్రజాశక్తి- ఆనందపురం : మండలంలోని శొంఠ్యాం రవిరాజా పెట్రోల్ బంక్ సమీపంలో బుధవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందింది. గోపాలపట్నంలో కాయగూరల వ్యాపారం చేస్తున్న ముచ్చర్ల గ్రామానికి చెందిన షినగం లక్ష్మి (52) ప్రతిరోజు లాగే బుధవారం ఉదయం తన మరిది కుమారుడు, ఆటోడ్రైవర్ చినగం అప్పలరాజుతో కలిసి ఆనందపురం పూల మార్కెట్లో కూరగాయలు కొనుగోలు చేశారు. తిరుగు ప్రయాణంలో శొంఠ్యాం రవిరాజా పెట్రోల్ బంక్ సమీపంలో ఆగి ఉన్న లారీని ఢీకొనడంతో ఆటో బోల్తా పడింది. ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలైన లక్ష్మితోపాటు స్వల్పగాయాలైన డ్రైవర్ అప్పలరాజును మెడికవర్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో లక్ష్మి మృత్యువాత పడింది. మృతురాలి భర్త సన్యాసులు ఫిర్యాదు మేకు సిఐ వాసునాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ సంతోష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి భీమిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు

నూతిలో జారిపడి యువకుడు మృతి

ప్రజాశక్తి-యస్.రాయవరం : మండలంలోని నీలాద్రిపురం గ్రామ సమీపంలో నూతిలో జారిపడి ఓ యువకుడు మరణించినట్లు ఎస్ఐ విభూషణరావు బుధవారం తెలిపారు.కోటవురట్ల మండలం పీతల రామన్నపాలెం గ్రామానికి చెందిన వంకల భూషణ్ తన స్నేహితులతో కలిసి రేవు పోలవరం బీచ్‌కు మంగళవారం వెళ్లి వస్తూ కాలకృత్యాలకు నీలాద్రిపురం వద్ద ఆగారు . పక్కనే ఉన్న నేలబావిలో కాళ్లు కడుగుతుండగా ప్రమాదవశాత్తు జారి నూతిలో పడి మృతి చెందాడు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పడవ బోల్తా పడి మత్స్యకారుడు మృతి

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని ముత్యాలమ్మపాలెం సముద్ర తీరంలో బుధవారం తెల్లవారుజాము పడవ బోల్తా పడి సూరాడ ముత్యాలు (56) అనే మత్స్యకారుడు మృతి చెందాడు. గ్రామానికి చెందిన ఏడుగురు మత్స్యకారులు పడవలో చేపల వేటకు వెళ్లారు భారీ అల ఢీకొనడంతో పడవ బోల్తా పడింది. ప్రమాదంలో ఆరుగురు మత్స్యకారులు ప్రాణాలతో ఒడ్డుకు చేరగా, ముత్యాలు గల్లంతయ్యారు. మధ్యాహ్నం 12.20 గంటలకు గల్లంతైన ముత్యాలు మృతదేహం సముద్రం ఒడ్డుకు కొట్టుకొచ్చింది. బోడిపల్లి నూకరాజు, చింతకాయలు పెంటయ్య, టిత్తి రాజయ్య, టిత్తి కుల్లయ్య, అరిజిల్లి బాడయ్య, కొరివి పెంటయ్య ప్రమాదం నుండి బయటపడ్డారు. మృతుడికి ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ముత్యాలు మృతితో గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టానికి అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృత్యువాత

ప్రజాశక్తి-రోలుగుంట: మండలంలోని పెదపేటలో విషాదం చోటుచేసుకుంది. గొలుగొండ మండలం ఏటిగైరంపేట గ్రామానికి చెందిన పోతల అప్పలనాయుడు(చిన్న) రోలుగుంట మండలం పెదపేట వీర గంగలమ్మ గుడి వద్ద బోయిన సుంకన్న పామాయిల్ తోటలో మట్టలు తొలగిస్తున్నాడు. ఒక మట్ట విద్యుత్ తీగలకు తగిలి కరెంట్ షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్ఐ రామకృష్ణారావు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

ఇద్దరు గంజాయి నిందితుల అరెస్టు

ప్రజాశక్తి గోపాలపట్నం : రెండు గంజాయి కేసుల్లో కొన్ని నెలలుగా పరారీలో ఉన్న ఇద్దరు నిందితులను గోపాలపట్నం పోలీసులు అరెస్ట్ రిమాండ్‌కు తరలించారు. సిఐ సన్యాసినాయుడు తెలిపిన వివరాలివి. రెండు గంజాయి కేసులో నిందితులుగా ఉన్న హుకుంపేటకు చెందిన గుంట కార్తిక్, కోరాపుట్‌కు చెందిన బాబులు కుర్ర తప్పించుకు తిరుగుతున్నారు. ప్రత్యేకబృందాలతో వారిపై నిఘా పెట్టి, హుకుంపేట, జోలాపుట్ పరిసర ప్రాంతాల్లో వారిని అరెస్ట్ చేసినట్లు సిఐ తెలిపారు.

రైతుబజారులో సెల్‌ఫోన్ చోరీ

ప్రజాశక్తి- కొమ్మాది: రైతు బజార్లో దొంగల హల్‌చల్‌తో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. బుధవారం మధురవాడకు మధురవాడ శివశక్తినగర్‌కు చెందినరిపోర్టర్‌కూరగాయల కొనుగోలుకు రైతు బజారుకు వెళ్లగా, వెనుక నుండి వచ్చిన ఇద్దరు వ్యక్తులు చాకచక్యంగా అతని సెల్‌ఫోన్‌ను చోరీ చేశారు. దీనిపై బాధితుడు క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కనులపండువగా దీపోత్సవం

• దేదీప్యమానంగా వెలుగొందిన అనంత పద్మనాభుని సన్నిధి

సినీ హీరో శ్రీనివాస్‌తో కలిసి తొలిదీపం వెలిగిస్తున్న ఎమ్మెల్యే గంటా

ప్రజాశక్తి -పద్మనాభం: మండల కేంద్రంలోని అనంత పద్మనాభస్వామి దీపోత్సవం బుధవారం కనులపండువగా జరిగింది. ఏటా కార్తీక బహుళ అమావాస్య రోజున భక్తుల సహకారంతో దేవాదాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే వేడుకను సినీహీరో బెల్లంకొండ శ్రీనివాస్‌తో కలిసి స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తొలిదీపం వెలిగించి ప్రారంభించారు. అనంతరం విజయనగరం, శ్రీకాకుళం, విశాఖ జిల్లాల నుంచి తండోపతండాలుగా తరలివచ్చిన భక్తులకు అనంతపద్మనాభుని కొండపైకి వెళ్లే మెట్ల మార్గంలో ఇరువైపులా దీపాలను వెలిగించారు. దీపపు కాంతులతో పద్మనాభుని కొండ దేదీప్యమానంగా వెలుగొందింది.

అంతకుముందు అనంత పద్మనాభస్వామి ఆలయంలోనూ, కొండకు దిగువనునన కుంతీ మాధవస్వామి ఆలయంలోనూ కొండ మెట్టు మార్గం, సమీపంలో ఉన్న శివాలయంలోనూ భక్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ ఇఒ నరసింహారాజు ఆధ్వర్యంలో సింహాచలం విజయనగరం శ్రీకాకుళం కొన్ని దేవస్థానాల నుండి వచ్చిన పురోహితులు పూజలు చేయించారు. కొండ దిగువన కుంతీ మాధవస్వామి ఆలయంలో శ్రీదేవి భూదేవి సమేత అనంత పద్మనాభుని ఉత్సవమూర్తులను గరుడ వాహనంపై ప్రతిష్ఠించి, ఆలయ గాలిగోపురం నుంచి పద్మనాభం ప్రధాన రహదారుల్లో ఊరేగించి, తొలి పావంచా వద్దకు తీసుకెళ్లి అక్కడ ఉత్సవ మూర్తులను ప్రతిష్ఠించి, ఆలయ ఆచారం ప్రకారం ఆలయ అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్ గజపతిరాజు కుటుంబీకుల పేరిట తొలి పూజలు చేశారు. సాయంసంధ్య వేళ ఎమ్మెల్యే గంటా తొలిదీపం వెలిగించగా, తర్వాత భక్తులంతా ఒక్కరొక్కరుగా మెట్లపై ఏర్పాటుచేసిన మట్టిప్రమిదల్లోని దీపాలు వెలిగించారు. అమావాస్య చీకట్లు ముసురుకుంటున్న వేళ, దీపపు కాంతులతో పద్మనాభుని కొండ దేదీప్యమానంగా విరాజిల్లి, భక్తులు, సందర్శకులు, స్థానికులకు కనువిందు చేసింది.

దీపోత్సవానికి పోటెత్తిన భక్తులు

ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న జెసి, ఆర్‌డిఒ

కట్టుదిట్టమైన భద్రత, ఏర్పాట్లు

అనంతుని దీపోత్సవ వేళ పద్మనాభంలో అధికారులు, పోలీసులు పటిష్ఠమైన ఏర్పాట్లు, కట్టుదిట్టమైన భద్రత కల్పించారు. ముందుస్తు ప్రణాళికలతో పార్కింగ్, క్యూలైన్లు, ఇతర ఏర్పాట్లు చేయడంతో దీపోత్సవ పండుగ దిగ్విజయంగా సాగింది. ఉదయం ఆరుగంటల నుంచి భక్తుల తాకిడి మొదలై, పదిగంటలకే దాదాపు లక్షమంది కొండపైకి చేరుకుని పద్మనాభుని దర్శించుకుని పూజలు చేశారు. 500మందికి మందికి పైగా పోలీసులు భద్రతా చర్యలు చేపట్టారు, ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా ముందుగానే పార్కింగ్, వాహనాల మళ్లింపు వంటి చర్యలు చేపట్టారు. ఘాట్‌రోడ్డులో వాహనాలను నియంత్రించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ మయూర్‌అశోక్, భీమిలి ఆర్‌డిఒ సంగీత్‌మాధుర్, స్థానిక తహశీల్దార్ ఆనందరావు, ఎంపిడిఒ రూపేష్, ఎంపిపి కె.రాంబాబు, పోలీసులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. మండల ఆర్ఎంపి వైద్యుల సంఘంఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పద్మనాభ యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో ప్రత్యేక భోజన సదుపాయం కల్పించారు. పద్మనాభం తహశీల్దార్ కార్యాలయం ఆధ్వర్యంలో 100 కిలోలపులిహోరాను తయారుచేసి, ప్యాకెట్ల రూపంలో భక్తులకు అందించారు.

వైద్యశిబిరాల ఏర్పాటు

సీతమ్మధార: అనంత పద్మనాభ స్వామి ఆలయంలో భక్తుల సౌకర్యార్థం నాలుగు మెడికల్ క్యాంపులు, మూడు 108 అంబులెన్సు అందుబాటులో ఉంచినట్లు డిఎంహెచ్ఒ డాక్టర్.పి.జగదీశ్వరరావు తెలిపారు. గాయత్రి, ఎన్నారై ప్రైవేటు వైద్యకాలేజీలు, కెజిహెచ్, భీమిలి సిహెచ్‌సి నుంచి వైద్యనిపుణులు పాల్గొని భక్తులకు సేవలు అందించారు డాక్టర్ బి ఉమావతి పాల్గొన్నారు.

సిఐటియు మహాసభలకు విరాళం

జగ్గునాయుడుకు విరాళం అందిస్తున్న సిఐటియు నేతలు

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖ నగరంలో జరుగుతున్న సిఐటియు అఖిల భారత మహాసభలకు స్టీల్ సిఐటియు ఆధ్వర్యంలో రూ. ఐదు లక్షల నిధిని మొదటి విడతగా స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు ఎం జగ్గునాయుడుకు యూనియన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు యు రామస్వామి, జె అయోధ్యరామ్ అందజేశారు. బుధవారం ఉక్కునగరం సిఐటియు కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో గౌరవాధ్యక్షులు ఎం జగ్గు నాయుడు మాట్లాడుతూ అఖిల భారత సిఐటియు మహాసభల ప్రాధాన్యతను గుర్తించిన స్టీల్ సిఐటియు కార్యకర్తలు అందించిన విరాళం అభినందనీయమన్నారు. స్టీల్ కార్మికులపై రాష్ట్ర ముఖ్యమంత్రి స్థాయిలో చంద్రబాబు నాయుడు అనుచిత వ్యాఖ్యలు చేయడం అత్యంత దుర్మార్గమన్నారు దీనిని కార్మిక వర్గం తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పి శ్రీనివాసరాజు, బి అప్పారావు, టి వి కె రాజు, బి మహేష్, పుల్లారావు, డి ఎస్ వి ఎస్ శ్రీనివాస్, రామన్న, సిహెచ్.వెంకట్రావు, వి.ప్రసాద్, విడివి పూర్ణచంద్ర రావు, శ్రీనివాస్ రెడ్డి, కె భానుమూర్తి, లోకేష్, పవన్, రాజు, వివిధ విభాగాల కార్యదర్శులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి పదో వార్డు వివేకానందనగర్‌లో జివిఎంసి నిధులు రూ 55 లక్షలతో రోడ్డు, కాలువలు పలు అభివృద్ధి పనులకు బుధవారం స్థానిక ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మీ రాజశేఖర్‌తో కలిసి శంకుస్థాపన చేసారు. కార్యక్రమంలో జివిఎంసి డిఇఇ వెంకటరావు, ఎఇఇ వసంత, వార్డు టిడిపి అధ్యక్షులు గాడు అప్పలనాయుడు, ప్రధాన కార్యదర్శి వేమల వెంకట్రావు, జనసేన అధ్యక్షుడు బండి రాజా రమేష్, ఉపాధ్యక్షులు చోడగంజి అప్పలనాయుడు, క్లస్టర్ ఇన్‌చార్జ్ మద్దిల రాజేష్ పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాలకు సామగ్రి వితరణ

ప్రజాశక్తి తగరపువలస: భీమిలి మండలం దాకమర్రి జిల్లా పరిషత్ పాఠశాలకు అదే గ్రామానికి చెందిన యువ నాయకులు చెల్లూరి నాని రూ.50 వేల విలువచేసే వస్తు సామగ్రిని వితరణగా అందజేశారు. విద్యార్థులకు ఉపయోగపడే క్రీడా సామగ్రి, ట్యూబ్ లైట్లు ఫ్యాన్లు, పుస్తకాలను భద్రపరిచే ఇనుప ర్యాక్‌లను బుధవారం జెడ్‌పిటిసి గాడు వెంకటప్పుడు చేతులు మీదుగా ఉపాధ్యాయులకు అందజేశారు. పాఠశాల అభివృద్ధికి సహకారం అందించిన చెల్లూరు నానిని వెంకటప్పుడు అభినందించారు కార్యక్రమంలో సిగనబంద సర్పంచ్‌గాడు వెంకటనారాయణ, ఎంపిటిసి సిహెచ్..నగేష్‌బాబు, గణపతి రావు, పదగల గురునాయుడు, ఎస్ఎంసి చైర్మన్ వై. కామేష్, ఎం. నరసింహారావు గ్రామీణ వైద్యుల సంఘం జోనల్ ప్రధాన కార్యదర్శి గెద్ద చిరంజీవి, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు

పారిశుద్ధ్య సిబ్బందికి దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి గోపాలపట్నం : జివిఎంసి 91వ వార్డు లక్ష్మీ నగర్‌కు చెందిన శానిటరీ సూపర్‌వైజర్లు, సిబ్బందికి వార్డు టిడిపి అధ్యక్షులు నారిపిన్ని సత్తిరాజు ఆధ్వర్యంలో బుధవారం డ్రెస్ క్లాత్‌లు , చీరలు , టవర్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు నరవ అనూష, మంగా లక్ష్మీ అలజంగి శ్రీను, బోనెల రామకృష్ణ, ముదపక శివ, కనక, సచివాలయం, శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు

గాజువాక: జివిఎంసి 74వ వార్డు వెంపల్‌నగర్‌లో పారిశుద్ధ్య కార్మికులకు బుధవారం బట్టలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ ఎ కిరణ్, కార్పొరేటర్ తిప్పల వంశీ రెడ్డి, పారిశుద్ధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

సీతమ్మధార : జివిఎంసి 44వ వార్డులో శానిటేషన్ సిబ్బందికి జివిఎంసిలో ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు దుస్తులు పంపిణీ చేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ పాండు తదితరులు పాల్గొన్నారు.

కేర్‌లో విజయవంతంగా గుండె మార్పిడి

• 54 ఏళ్ల రోగికి పునర్జన్మనిచ్చిన వైద్యులు
• విశాఖ వైద్య చరిత్రలో మరో మైలురాయి

ప్రజాశక్తి - ఆరిలోవ : గుండె సంబంధిత టకోట్సుబో కార్డియోమపతి వ్యాధితో బాధపడుతూ ప్రాణాపాయ స్థితిలో ఉన్న 54 ఏళ్ల రోగికి కేర్ ఆసుపత్రి వైద్యులు విజయవంతంగా గుండె మార్పిడి చేసి ప్రాణదానం చేసి రికార్డు నెలకొల్పారు. బుధవారం ఆరిలోవ హెల్త్‌సిటీ కేర్ ఆసుపత్రిలో మీడియా సమావేశంలో వైద్యులు మాట్లాడుతూ, వెంటిక్యులార్ టాకికార్డియా హృద్రోగ సమస్యతో బాధపడుతున్న 54 ఏళ్ల వ్యాపారవేత్త మూడు నెలల క్రితం కేర్ వైద్యులను సంప్రదించగా రోగి ఆహారం తీసుకున్నా, నడిచినా, మాట్లాడినా తీవ్రమైన ఆయాసంతో బాధపడుతూ ప్రాణాపాయ స్థితికి చేరుకున్నారు. దీనికి గుండె మార్పిడి ఒక్కటే ప్రత్యామ్నాయమని నిర్ధారణకు వచ్చిన కేర్ వైద్యులు, రోగి బంధువులు దాతల కోసం జీవన్‌ధాన్‌ను సంప్రదించారు.

గతనెల 26న శ్రీకాకుళం ఆసుపత్రిలో బ్రెయిన్ డెడ్ అయిన దాత నుంచి సేకరించిన గుండెను పోలీసుల సహకారంతో గ్రీన్‌ఛానల్ ద్వారా విశాఖకు తీసుకొచ్చి, డాక్టర్ ఎల్.విజయ్ కుమార్ మార్గదర్శకత్వంలో సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ సివి.రావు నేతృత్వంలో నెఫ్రాలజిస్ట్ డాక్టర్ వేణుగోపాల్, ఎనస్థీసియా, నెఫ్రాలజీ, కార్డియాక్ విభాగాల నిపుణుల సహకారంతో బాధిత రోగికి అమర్చారు. ఆపరేషన్ విజయవంతం కావడంతో రోగి 11 రోజుల వ్యవధిలో రోగి పూర్తిగా కోలుకున్నాడు. జీవన్‌దాన్ చీఫ్ ట్రాన్స్‌ప్లాంటేషన్ కో ఆర్డినేటర్ డాక్టర్ కె.రాంబాబు, ట్రాఫిక్ ఎడిసిపి ప్రవీణ్ కుమార్, కేర్ సిఒఒ సుభాష్ రెడ్డి, డాక్టర్ ఎల్.విజయ్, డాక్టర్ సివి.రావు, డాక్టర్ కిరణ్‌బాబు, వేణుగోపాల్ పాల్గొన్నారు. .కోలుకున్న రోగి, కుటుంబ సభ్యులు మాట్లాడుతూ పునర్జన్మ ప్రసాదించిన ఆసుపత్రి వైద్యులకు, జీవన్‌ధాన్‌కు, ట్రాఫిక్ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

వివరాలు వెల్లడిస్తున్న కేర్ వైద్యనిపుణులు

టెట్ అర్హత నుంచి మినహాయించాలి

ప్రజాశక్తి- పెందుర్తి: ఐదేళ్ల పైబడి సర్వీసు ఉన్న ఉపాధ్యాయులంతా విధిగా రెండేళ్లలోపు ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ఉత్తీర్ణత సాధించాలని, లేకుంటే వారిని విధుల్లోంచి తొలగించాలన్న సుప్రీంకోర్టు తీర్పుతో ఉపాధ్యాయుల్లో గందరగోళం, ఆందోళన పరిస్థితులు నెలకొన్నాయని, దీన్ని వెంటనే మినహాయించాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి టిఆర్ అంబేద్కర్ అన్నారు. బుధవారం మండలంలోని అన్ని ఉన్నతపాఠశాలల్లో యూనియన్ జిల్లా కార్యదర్శి చుక్క సత్యం ఆధ్వర్యంలో సభ్యత్వసమోదు చేపట్టారు. ఈ సందర్భంగా అంబేద్కర్ మాట్లాడుతూ, సెప్టెంబర్ ఒకటిన వెలువరించిన సుప్రీంకోర్టు తీర్పుతో ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయుల్లో ఆందోళన నెలకొన్నాయి. విద్యాహక్కు చట్టంలోని సెక్షన్ 23ను పార్లమెంట్‌లో చట్ట సవరణ చేసి 2010కు ముందు నియమితులైన వారందరికీ టెట్ నుంచి మినహాయించాలని డిమాండ్ చేశారు. దీనిపై యుటిఎఫ్ ఆధ్వర్యాన వచ్చేనెల 9న భీమిలి డివిజన్‌లోనూ, 10న పెందుర్తి డివిజన్‌లో చేపట్టే నిరసన ర్యాలీలో ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. 29శాతం ఐఆర్ ప్రకటన, 12వ పిఆర్‌సి నియామకం, బోధనేతర బాధ్యతల నుంచి ఉపాధ్యాయులను మినహాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ పూర్వ సహాధ్యక్షురాలు రొంగలి ఉమాదేవి, జిల్లా కార్యదర్శి వంగ రామలక్ష్మి, సీనియర్ నాయకులు తమ్మారావు, బెనర్జీ పాల్గొన్నారు

అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి భీమునిపట్నం : జివిఎంసి 2,3 వార్డుల్లో శ్మశానవాటిక కాంపౌండ్ వాల్, బర్నింగ్ ప్లాట్ ఫామ్స్, 195 మీటర్ల సిసి రోడ్డును జివిఎంసి కమిషనర్ కేతన్‌గార్గ్ బుధవారంపరిశీలించారు శ్మశాన వాటికలో విద్యుత్ దీపాలు, వెయిటింగ్ హాల్, అస్థికలు భద్ర పరుచుకునేందుకు లాక్ రూమ్,కేర్‌టేకర్, వాచ్‌మెన్ నియామకం చేయాలని రెండో వార్డు కార్పొరేటర్ గాడు చిన్నికుమారి లక్ష్మీ కమిషనర్ ను కోరారు మూడోవార్డు గొల్లలపాలెం నుంచి కస్తూర్బా బాలికా విద్యాలయం రోడ్డును పరిశీలించారు జెడ్‌సి ఒమ్మి అయ్యప్ప నాయుడు, మాజీ కౌన్సిలర్ గంటా నూకరాజు, డిఇఇ సురేష్, పాల్గొన్నారు

వార్డుల సందర్శనలో జివిఎంసి కమిషనర్ గార్గ్

పిసిఆర్ ల్యాబ్‌పై అవగాహన

ప్రజాశక్తి భీమునిపట్నం : మంగమారిపేట జెడ్‌పి హైస్కూల్ విద్యార్థులకు బుధవారం జివిఎంసి నాలుగోవార్డు చేపలుప్పాడ, కొత్తూరులోని మత్స్యశాఖ ఆధ్వర్యంలో పిసిఆర్ ల్యాబ్‌పై అవగాహన కల్పించారు. యాంటీ బయోటిక్, పెస్టిసైడ్ వంటి అవశేషాలు నిర్ధారణకు ప్రయోగ శాల దోహద పడుతుందని ఎఫ్‌డిఒ ఆర్ ఈశ్వర రాజు తెలిపారు రొయ్య పిల్లలకు సోకే తెల్లమచ్చల వ్యాధి వైరస్ నిర్ధారణ, ఇహెచ్‌పి, డబ్ల్యుఎస్‌ఎస్‌వి, ఐహెచ్‌హెచ్‌ఎన్‌వి పరీక్షలు చేస్తున్నట్లు వివరించారు

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

అన్నదాత సుఖీభవ- పిఎం కిసాన్ నిధులు విడుదల

చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల, జాయింట్ కలెక్టర్ జాహ్నవి

ప్రజాశక్తి-సబ్బవరం : రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వం ధ్యేయమని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు అన్నారు. అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ పథకం నిధులు రైతుల ఖాతాలో డబ్బులు జమ చేసే జిల్లా స్థాయి కార్యక్రమం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ రెండో విడతలో జిల్లాలో 2,42,480 మంది రైతులకు రూ.158.4 కోట్లు జమ చేసినట్లు తెలిపారు. పెందుర్తి నియోజకవర్గంలో 18,606 మంది రైతులకు రూ.12కోట్ల 34లక్షల 90 వేలు జమ చేసినట్లు చెప్పారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి మాట్లాడుతూ ఎవరైనా అర్హులైన రైతులు ఉంటే సంబంధిత అధికారులను వెంటనే సంప్రదిస్తే వారి ఖాతాలో కూడా డబ్బులు జమ చేయడం జరుగుతుందని చెప్పారు. అనంతరం రైతులకు చెక్కును ఎమ్మెల్యే, జెసి చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బోకం సూర్యకుమారి రామునాయుడు, మండల ప్రత్యేక అధికారి కె.రామామణి, జిల్లా వ్యవసాయశాఖ ఏడిలు సుబ్రమణ్యం, అనిత, మండల వ్యవసాయ అధికారి పోతల సత్యనారాయణ, వైస్ ఎంపీపీలు శరగడం రూప్నీ లక్ష్మీ రాము, మామిడి లక్ష్మి, కూటమి నాయకులు బలిరెడ్డి అప్పారావు, ఇందల వెంకటరమణ, సాలాపు వెంకటేశ్వరరావు, కర్రి కనకరాజు, మిడతడ మహాలక్ష్మి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి : అన్నదాత సుఖీభవ పిఎం కిసాన్ రెండో విడత సొమ్మును స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ బుధవారం విడుదల చేశారు. అనకాపల్లి గుండాల జంక్షన్లో ఉన్న శంకరం ఆర్యో హాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అనకాపల్లి నియోజకవర్గంలో 22,300 మంది లబ్ధిదారులకు రూ.14.56 కోట్లు జమ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏపీయూఎఫ్ఐడిసి చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర, కూటమి నాయకులు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

నాతవరం : ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 'అన్నదాత సుఖీభవ' పథకం ద్వారా రెండో విడత నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. నాతవరంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న స్పీకర్ మాట్లాడుతూ నర్సీపట్నం నియోజకవర్గంలో 35,040 మంది రైతులకు రూ.23.10 కోట్లు విడుదలైట్లు చెప్పారు. నాతవరం మండలంలోని 10,780 మంది రైతులకు రూ. 7.12 కోట్లు వారి ఖాతాల్లో పడ్డాయన్నారు. కార్యక్రమంలో తాండవ ప్రాజెక్ట్ చైర్మన్ కరక సత్యనారాయణ, జడ్పిటిసి సుకల రమణమ్మ, ఆర్డీవో వివి రమణ, ఏడిఏ శ్రీదేవి, మార్కెట్ కమిటీ చైర్మన్ గవిరెడ్డి వెంకటరమణ, జనసేన నియోజకవర్గం ఇంచార్జ్ సూర్యచంద్ర పాల్గొన్నారు.

రోలుగుంట : రోలుగుంట మండలం రామమందిరం వద్ద ఏర్పాటు చేసిన అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎస్ఎన్.రాజు పాల్గొని మాట్లాడారు. చోడవరం నియోజకవర్గంలో 33 కోట్ల 50లక్షల రూపాయలు రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు చెప్పారు. రోలుగుంట మండలానికి 7 కోట్ల 3లక్షల రూపాయలు జమ అయ్యిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

తగరపువలస : భీమునిపట్నం మండలం తాటితూరు గ్రామంలో పీఎం కిసాన్ అన్నదాత సుఖీభవ నిధులు విడుదల జిల్లాస్థాయి కార్యక్రమంలో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అధ్యక్షతన జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ పాల్గొన్నారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ భీమిలి నియోజకవర్గంలో 14,981 మంది రైతులు రూ.10.0617 కోట్లు మేర లబ్ది పొందుతున్నారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, జిల్లా కలెక్టర్ హరేంధ్ర ప్రసాద్తో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పిటిసి గాడు వెంకటప్పుడు, టిడిపి అధ్యక్షులు సరగడ అప్పారావు, గాడు తాతి నాయుడు, సంగనబంద సర్పంచ్ వెంకట నారాయణ, మజ్జి వెంకట్రావు కొమర రాము, జిల్లా వ్యవసాయ అధికారులు డి.అప్పలస్వామి ప్రవీణ వ్యవసాయశాఖ ఎడి విజయ్ కుమార్, ఎంపిడిఒ నరసింహారావు, శివకోమలి, సెక్రెటరీ శ్యామ్ ప్రజలు పాల్గొన్నారు.

పెందుర్తి : మండలంలోని రాంపురం గ్రామంలో 'అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్' పథకం పంపిణీలో జడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ రెడ్డి నారాయణరావు, తెలుగుదేశం పార్టీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

యస్.రాయవరం : అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ పథకం ద్వారా నిధులు విడుదల చేయడంపై కూటమి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కొరుప్రోలు పిఎసిఎస్ డైరెక్టర్ కోన అప్పలరాజు మాట్లాడుతూ వరి కోతలకు ముందుగా డబ్బులు వేయడంతో రైతులకు చేయూతనిచ్చినట్టుగా భావిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో రాయవరం పిఎసిఎస్ అధ్యక్షులు తుంపాల నాగేశ్వరరావు, ఉప్పరాపల్లి సర్పంచ్ శ్రీరాములు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న శాసన సభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు

ఆర్థిక సాయం అందజేస్తున్న ఎస్పి తుహిన్ సిన్హా

ఉద్యోగ విరమణ చేసిన హోంగార్డుకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లాలోని నర్సీపట్నం టౌన్ పోలీస్ స్టేషన్లో హోంగార్డుగా విధులు నిర్వహించి ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన కైసర్ల కృష్ణారావుకు జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా చేతుల మీదుగా బుధవారం ఆర్థిక సహాయం అందజేశారు. ఉమ్మడి విశాఖ, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో విధులు నిర్వహిస్తున్న హోంగార్డులు స్వచ్ఛందంగా ఒక రోజు డ్యూటీ అలవెన్సును విరాళంగా అందించగా, ఆ నిధితో కూడిన 4 లక్షల 3 వేల,670 రూపాయల చెక్కును జిల్లా ఎస్పీ తన కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో కార్యాలయ పరిపాలన అధికారి సిహెచ్.తిలక్ బాబు, జూనియర్ అసిస్టెంట్ రమేష్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి-దేవరాపల్లి : గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై సర్పంచ్లు, కార్యదర్శులు దృష్టి సారించాలని ఎంపిపి చింతల బుల్లిలక్ష్మి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో థీమ్-5 క్లీన్ అండ్ గ్రీన్పై ఎంపిపి అధ్యక్షతన సర్పంచులు, ఉప సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ గ్రామంలో హరిత రాయబారులు వచ్చినప్పుడు తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి వారికి అందేటట్లు చూడాలన్నారు. రోడ్లపైనా, కాలువల్లోనూ ఎలాంటి చెత్త వేయకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామాల్లో పరిశుభ్రత లేకపోవడం వలన వచ్చే వ్యాధులపై తెలియజేశారు. కార్యక్రమంలో జడ్పిటిసి కర్రి సత్యం, ఎంపిడిఓ ఎంవి.సువర్ణరాజు, పరిపాలన అధికారి డివి లక్ష్మీనారాయణ , స్వచ్ఛభారత్ మండల కోఆర్డినేటర్ విపివి త్రినాథ్ పాల్గొన్నారు.

మతిస్థిమితం కోల్పోయిన వారికి 'మనోబంధు' అండ

ప్రజాశక్తి-అనకాపల్లి : మతిస్థిమితం లేక నిరాశ్రయులై రోడ్లపై సంచరిస్తున్న వారిని ఆదరించి వారికి అండగా మనోబంధు ఫౌండేషన్ సంస్థ నిలుస్తుందని ఆ సంస్థ ప్రతినిధులు డాక్టర్ శశి, జీవీఎంసీ జోనల్ కమిషనర్ చక్రవర్తి తదితరులు పేర్కొన్నారు. ఈ మేరకు జీవీఎంసీ జోనల్ కార్యాలయంలో సంస్థ గోడపత్రికను బుధవారం ఆవిష్కరించారు. మానసిక రుగ్మతతో బాధపడుతూ ఆదరించేవారు లేక, ఆహారం తాగునీరు లేక రోడ్లపై తిరుగుతూ ఉండే వారిని గుర్తించి వైద్య సేవలు కల్పించి తిరిగి వారి కుటుంబాలకు కలపడమే తమ సంస్థ కర్తవ్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో జివిఎంసి ఉద్యోగి మద్ర శేఖర్ పాల్గొన్నారు.

ఉచిత పశు వైద్య శిబిరం

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : బుచ్చయ్యపేట మండలం నీలకంఠాపురం గ్రామంలో బుధవారం పశుసంవర్ధక శాఖ, డిఎల్డిఏ సంయుక్తంగా ఉచితంగా పశు గర్భ కోశ చికిత్సా శిబిరం నిర్వహించారు. దీనిని జడ్పీటీసీ దొండ రాంబాబు ప్రారంభించారు. అన్ని రకాల రక్త, మూత్ర, పేడ పరీక్షలు నిర్వహించారు. మొత్తం 56 పశువులకు వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ చంద్రశేఖర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, డిఎల్డిఏ డాక్టర్ శ్రీనివాస్ సజ్జా మాట్లాడుతూ లింగ నిర్ధారిత వీర్యం ఉపయోగాలు, పాడి పశువులను పెంచే ఆధునిక పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాము బగాది, డాక్టర్ పద్మజ, డాక్టర్ సౌజన్య, స్థానిక సర్పంచ్ పడాల నాగభూషణం, పిఏసిఎస్ అధ్యక్షులు కోట సత్యనారాయణ పాల్గొన్నారు.

పశు వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న జెడ్పిటిసి సభ్యులు రాంబాబు

ఇవిఎం గోదాము తనిఖీ

ప్రజాశక్తి-అనకాపల్లి : ఈవీఎం (ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్) గోదాము వద్ద సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని జిల్లా రెవెన్యూ అధికారి వై.సత్యనారాయణరావు సిబ్బందిని ఆదేశించారు. మాసంతపు తనిఖీలో భాగంగా బుధవారం అనకాపల్లి జిల్లా ఎస్పి కార్యాలయం ప్రాంగణంలో ఉన్న ఈవీఎం గోదామును డిఆర్వో, అనకాపల్లి ఆర్డీఓ షేక్ ఆయిషాతో పాటు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి తనిఖీ చేశారు. ఈవీఎం గోదాము వద్ద పరిస్థితులను, సీసీ కెమెరాల పనితీరును, ప్రధాన ద్వారానికి ఉన్న సీళ్లను పరిశీలించారు. భద్రతా ప్రమాణాలపై అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా ఎన్నికల విభాగం పర్యవేక్షకులు ఎస్విఎస్ వాసు నాయుడు, అనకాపల్లి అగ్ని మాపక స్టేషన్ ఫైర్ ఆఫీసర్ పి.వెంకటరమణ, టిడిపి, వైసిపి, కాంగ్రెస్, ఆప్, బిఎస్పీ పార్టీల ప్రతినిధులు బొలిశెట్టి శ్రీనివాసరావు, కోన ఉమామహేశ్వరరావు, పి.రమణ, కె.హరినాధబాబు, జి.సూరిబాబు ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో అభ్యంతరాలుంటే తెలియజేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : ఓటరు జాబితాలో మార్పులు చేర్పులపై అభ్యంతరాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని జిల్లా రెవిన్యూ అధికారి వై సత్యనారాయణరావు రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాకి చెందిన వివిధ రాజకీయ పార్టీల నేతలతో మాసంతపు సమావేశాన్ని డిఆర్ఓ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితాలోని సమస్యలను ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకువెళ్లాలనే లక్ష్యంతోనే ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. గత నెల సమావేశం నుండి నేటి వరకు కొత్తగా ఓటరు నమోదు, ఓటు తొలగింపు, ఐడి కార్డు సవరణల కోసం 964 దరఖాస్తులు రాగా, 466 దరఖాస్తులు పరిష్కరించామని తెలిపారు. ఈఆర్ఓ వద్ద 498 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయన్నారు. సమావేశంలో జిల్లా ఎన్నికల విభాగం పర్యవేక్షకులు ఎస్విఎస్ వాసు నాయుడు, ఉప తహసీల్దార్ ముజీబ్, ఎన్నికల సిబ్బంది, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ మండల కార్యవర్గం ఎన్నిక

కొత్త కమిటీ సభ్యులతో యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

ప్రజాశక్తి-అనకాపల్లి : ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) అనకాపల్లి మండల శాఖ నూతన కార్యవర్గ ఎన్నికలు అనకాపల్లి సిఐటియు కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వత్సవాయి శ్రీలక్ష్మి, గొంది చిన్నబ్బాయి ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఈ ఎన్నికల్లో ఎన్నికల అధికారిగా జిల్లా కోశాధికారి జోగా రాజేష్, ఎన్నికల పరిశీలకులుగా రొంగలి అక్కునాయుడు వ్యవహరించారు. ఈ సందర్భంగా చిన్నబ్బాయి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సంక్షేమం కోసం, సమస్యల పరిష్కారం కోసం యుటిఎఫ్ నిరంతరం పోరాటాలు చేస్తుందని తెలిపారు. పిఆర్సి కమిషన్ వేయించడానికి ప్రస్తుతం పోరాటం చేయవలసి ఉందన్నారు. అనంతరం మండల కార్యవర్గం, మండల కౌన్సిల్ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యుటిఎఫ్ మండల గౌరవ అధ్యక్షులుగా మల్లారెడ్డి శంకర్ ప్రసాద్, అధ్యక్షులుగా నూరెడ్డి జగ్గుబాబు, సహధ్యక్షులుగా వందనాల పావని వై.రాము, ప్రధాన కార్యదర్శిగా మామిడి బాబురావు, కోశాధికారిగా కొమ్ముజు సత్యవేణి, ఆడిట్ కమిటీ కన్వీనర్గా తేజ్ వర్ధన్, కార్యదర్శులుగా పి.రమణ, రాజేశ్వరి, శ్రీనివాస్, జగన్నాథం, జిల్లా కౌన్సిలర్లుగా సూచికొండ రూప్నీ, బివి సత్యనారాయణ, అర్జున్, రామాంజనేయులు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా పూర్వ అధ్యక్షులు జికెఆర్ స్వామి, అలివేలు, ఆశ, చింతాడ వెంకటరమణ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

వైఎస్.జగన్ను కలిసిన జెడ్పిటిసి రాజు

ప్రజాశక్తి-పరవాడ : పరవాడ జెడ్పీటీసీ సభ్యులు పిఎస్.రాజు బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధినేత వైఎస్.జగన్మోహన్రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో జరుగుతున్న పార్టీ కార్యకలాపాలు, గ్రామస్థాయిలో అమలు జరుగుతున్న సామాజిక కార్యక్రమాలు, ప్రజల సమస్యలను జగన్కు తెలియజేశారు. పార్టీ కార్యకర్తలు మరింత చురుకుగా ప్రజల్లోకి వెళ్లాలని జగన్ సూచించారు. ప్రభుత్వం ఎలా ప్రజలను మోసం చేస్తుందో, నిజాలు ఎలా వక్రీకరించబడుతున్నాయో గ్రామాల్లోకి వెళ్లి ప్రజలకు వివరించి చైతన్యం తేవాలని కోరారు.

వైఎస్.జగన్తో జెడ్పిటిసి పిఎస్.రాజు

భూమి పూజ నిర్వహిస్తున్న గోవింద తదితరులు

తాగునీటి బోరు ఏర్పాటుకు భూమిపూజ

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని మునిపల్లి పంచాయతీ శివారు గొల్లపేట 6వ వార్డులో తాగునీటి బోరు ఏర్పాటుకు మాజీ సర్పంచ్ సోమిరెడ్డి గోవింద బుధవారం కొబ్బరికాయ కొట్టి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొల్లపేటలో దీర్ఘకాలికంగా మంచినీటికి ప్రజలు అవస్థలు పడుతున్నారని, ఈ విషయాన్ని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి దృష్టికి తీసుకు వెళ్లడంతో ఆయన వెంటనే స్పందించి నిధులు మంజూరు చేశారని తెలిపారు. కార్యక్రమంలో రైవాడ జలాశయ చైర్మన్ పోతల పాత్రునాయుడు, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, మాజీ సర్పంచ్ బొడ్డు వెంకట్రావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

21 నుండి కనకమహాలక్ష్మి మార్గశిర మాసోత్సవాలు

ప్రజాశక్తి - యలమంచిలి : యలమంచిలి ధర్మవరం వీధిలోని శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారి మార్గశిర మాసోత్సవాలు ఈ నెల 21 నుండి ప్రారంభమౌతాయని ఆలయ ఆహ్వాన కమిటీ పేర్కొంది. శుక్రవారం నుండి నెల రోజులు పాటు జరిగే ఉత్సవాల నిర్వహణ ఏర్పాట్లు పూర్తయ్యాయని పేర్కొన్నారు. భక్తులకు ఇబ్బందులు లేకండా బారికేడ్లు, చలువ పందిళ్ల నిర్మించి భక్తుల సౌకర్యార్థం పసుపు, కుంకుమ పూజలకు ఏర్పాటు చేస్తున్నట్లు వారు వివరించారు.

గృహ రుణాలు మంజూరు చేయాలి

ప్రజాశక్తి-ఎస్.రాయవరం : ప్రాథమిక వ్యవసాయ సహకార బ్యాంకులలో రైతులకు పంట రుణాలతో పాటు, గృహ నిర్మాణాలకు రుణాలు ఇచ్చేలా చర్యలు చేపట్టాలని డిసిసిబి చైర్మన్ కోన తాతారావుకు పెనుగొల్లు పిఎసిఎస్ చైర్మన్ రెడ్డి పవన్ కుమార్ విజ్ఞప్తి చేశారు. విశాఖలోని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు కార్యాలయంలో అధ్యక్షుడు తాతారావును పవన్‌కుమార్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. రైతుల ఇల్లు నిర్మాణానికి రుణాలు ఇవ్వడం వల్ల పేద రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని తెలిపారు. కార్యక్రమంలో పిఎసిఎస్ డైరెక్టర్ దోసపాత్రుని నాగేశ్వరరావు, సీఈవో ఎం.నారాయణరావు పాల్గొన్నారు.

వ్యవసాయ చెరువులను అభివృద్ధి చేస్తాం

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని వ్యవసాయ చెరువులను అభివృద్ధి చేస్తామని రైవాడ జలాశయ చైర్మన్ పోతల పాత్రునాయుడు అన్నారు. మండలంలోని మారేపల్లి కిల్లివాని చెరువును బుధవారం ఆయకట్టు రైతులు, నీటి సంఘం అధ్యక్షులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి దృష్టికి సమస్యలు తీసుకువెళ్లి చెరువు అభివృద్ధి పనులు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, ఆవుగడ్డ రామ్మూర్తి నాయుడు, నీటి సంఘం చైర్మన్ గుర్రిపల్లి మురళీకృష్ణ, ఆవుగడ్డ కోటిపల్లి నాయుడు, రెడ్డి అశోక్, నీటి సంఘం సభ్యులు, ఆయకట్టు రైతులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు అవగాహన

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : అనకాపల్లి టౌన్ ట్రాఫిక్ సిఐ ఎం.వెంకటనారాయణ బుధవారం ఆటో డ్రైవర్లతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ట్రాఫిక్ నిబంధనలు, నో-పార్కింగ్ నియమాలు, ప్రజల భద్రతపై వివరంగా అవగాహన కల్పించారు. తమకు కేటాయించిన ఆటో స్టాండ్ నుంచే ఆటోలు నడపాలని, ఫోర్-రోడ్స్ జంక్షన్ వద్దకు రావద్దని సూచించారు. కార్యక్రమంలో ఎస్.ఐ శేషగిరి, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న టౌన్ ట్రాఫిక్ సిఐ వెంకటనారాయణ

వరి పంటలో కేళీలు

దిగుబడి తగ్గుతుందని రైతుల ఆందోళన - కల్తీ విత్తనాలే కారణం

కేళీలు తేలిన వరి చేను

ప్రజాశక్తి-చోడవరం : పెట్టుబడులు పెరిగి వ్యవసాయం అంతంతమాత్రంగా చేస్తున్న రైతులను కల్తీ విత్తనాల బెడద పట్టి పీడిస్తుంది. దీంతో పంట దిగుబడులు విపరీతంగా తగ్గుతున్నాయని వరి రైతులు ఆందోళన చెందుతున్నారు. సంప్రదాయంగా వస్తున్న ఆర్‌జిఎల్ రకాన్ని గత కొనేళ్లగా రైతులు సాగు చేస్తూ వస్తున్నారు. ఈ విత్తనాలను ప్రభుత్వం సరఫరా చేసిన రైతు సేవా కేంద్రాల వద్ద, ప్రైవేటు వ్యాపారుల వద్ద కొనుగోలు చేశారు. ఈ ఏడాది ఈ రకానికి చెందిన విత్తనంలో కల్తీ కావడంతో పంట ఎదుగుదలలో హెచ్చుతగ్గులు కనిపిస్తున్నాయి. కొన్ని దుబ్బులు పొట్ట దశలో ఉంటే మరికొన్ని కల్తీ విత్తనం గింజ గట్టిపడి పక్వానికి వచ్చింది. దీంతో ముందుగా వండిన కల్తీ విత్తనాలను కోయలేక రైతులు దిగాలు చెందుతున్నారు. ప్రభుత్వం సరఫరా చేసిన విత్తనాల్లోనూ కల్తీ విత్తనాలు వచ్చి పొలంలో కేళీలు వచ్చాయని రైతులంటున్నారు. చోడవరం మండలం లక్ష్మీపురం చెరువు కింద ఆయకట్టు భూముల్లో వేసిన వరి పంటలో కేళీలు దర్శనమిస్తున్నాయి. సాగులో విపరీతమైన పెట్టుబడులు పెరిగి ఎరువులు పురుగు మందులకు అధిక స్థాయిలో ఖర్చు చేసిన రైతులకు పంట దిగుబడులు తగ్గితే ఎక్కువ నష్టం వాటిల్లుతుందని వారు వాపోతున్నారు.

ప్రేమ సమాజంలో వైద్య శిబిరం నిర్వహించాలి

ప్రజాశక్తి-యలమంచిలి టౌన్ : యలమంచిలి మున్సిపాలిటీ శివారులో నిర్వహిస్తున్న ప్రేమసమాజం వృద్ధాశ్రమం, అనాధశ్రమంలో వైద్య శిబిరం నిర్వహించాలని నిర్వాహకులు స్వామి రామకృష్ణ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన మాట్లాడుతూ ప్రేమ సమాజంలో 18మంది వృద్ధులు, 12 మంది పిల్లలు, ఐదుగురు ఉన్నట్లు తెలిపారు. దాతలు సహాయ సహకారంతో భోజనం, వసతి కల్పిస్తున్నామని చెప్పారు. అయితే వృద్ధులు బిపి, షుగర్ వ్యాధులతో పాటు మానసిక రుగ్మతలు కలిగిన వారు ఉన్నారని పేర్కొన్నారు. వీరిని వైద్య పరీక్షలు, మందుల కోసం యలమంచిలి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లడం పెద్ద సమస్యగా ఉందని, కొత్త ఆసుపత్రి బాగా లోపల ఉండడంతో ప్రత్యేకంగా ఆటో కట్టించుకొని వెళ్లవలసి వస్తుందని తెలిపారు. ఇది ఆర్థికంగా ఇబ్బందిగా ఉందని, అందువల్ల ప్రతి నెలా వృద్ధాశ్రమంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసిన వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించాలని కోరారు. అలాగే వయస్సు మళ్లిన వారు, కొందరు మానసిక రోగులు ఉండడంతో పారిశుధ్య నిర్వహణ ఇబ్బందిగా ఉందని, మున్సిపాలిటీ వారు స్పందించి పారిశుధ్య సిబ్బందిని 10రోజులకు ఒకసారి పంపించి శుభ్రం చేసి, బ్లీచింగ్ వేయాలని కోరారు.

ప్రేమ సమాజంలో వృద్ధులు

జనవాణిలో సమస్యలపై వినతులు

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి రింగ్ రోడ్డులోని జనసేన పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన జనవాణి గ్రీవెన్స్ కార్యక్రమంలో అనకాపల్లి నియోజకవర్గ ప్రజల నుండి వారి సమస్యలపై వినతి పత్రాలను శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ స్వీకరించారు. సమస్యలపై సానుకూలంగా స్పందించి అతి త్వరలోనే పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

యలమంచిలి : స్థానిక జిల్లాపరిషత్ అతిథి గృహంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన 'జనవాణి' కార్యక్రమంలో ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ ప్రజల నుండి వినతిపత్రాలు స్వీకరించారు. సుమారు 200 మంది రాతపూర్వకంగా అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలు తన దృష్టికి రాత పూర్వకంగా తీసుకొస్తే వాటి పరిష్కార బాధ్యత తాను తీసుకుంటానని చెప్పారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ ప్రసాదరాజు, అన్ని ప్రభుత్వ శాఖల అధికార్లు, కూటమి నేతలు ఊటికూటి రమేశ్, కొఠారు శ్రీనివాసరావు, బొద్దపు శ్రీను, గుర్రం శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు వింటున్న యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు

ఘనంగా ఇందిరాగాంధీ జయంతి

ప్రజాశక్తి-అనకాపల్లి : భారత రత్న మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి బుధవారం అనకాపల్లి జిల్లా కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనకాపల్లి నరసింగరావు పేట కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించారు. ఇందిరా గాంధీ దేశానికి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మలపురెడ్డి కోటేశ్వరరావు, కాళ్ల సత్యనారాయణ, కొట్ని మాణిక్యం, తుట్టా రమణ, సేనాపతి రాజు, కత్తెర శ్రీధర్, కట్టమూరి నూక అప్పారావు, కాపారపు సత్య నారాయణ పాల్గొన్నారు.

ఇందిరా గాంధీకి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

పన్ను రసీదు ఇస్తున్న పంచాయతీ ఇఒ శ్రీనివాసరావు

క్యూఆర్ కోడ్ సిస్టం ద్వారా ఇంటి పన్నుల చెల్లింపు

ప్రజాశక్తి-చోడవరం : క్యూఆర్ కోడ్ సిస్టం ద్వారా ఇంటి పన్నులు చెల్లించవచ్చని చోడవరం పంచాయతీ ఈవో కే.శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం క్యూఆర్ కోడ్ ద్వారా ఇంటి పన్నులు చెల్లించిన వారికి రసీదులను ఆయన అందజేశారు. పంచాయతీలో పన్నులు సిస్టం అంతా డిజిటల్ ప్రక్రియ జరుగుతుందని, గృహాల వివరాలన్నీ ఆన్లైన్ పొందుపరిచి పంచాయతీ ప్రజలకు పన్నులు చెల్లింపులో పారదర్శకత ఉండేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. సకాలంలో పన్నులు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రతాప్ సాహు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

టైరు పేలి లారీ బోల్తా

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : అధిక లోడుతో వెళ్తున్న లారీ టైర్ పేలిపోవడంతో ఆ లారీ బోల్తా పడిన సంఘటన మండలంలోని నీలకంఠాపురం- మెట్టపాలెం జంక్షన్‌కు మధ్య ఉన్న మలుపు వద్ద బుధవారం చోటుచేసుకుంది. గొంప ప్రాంతం నుండి రాతి బండలను అనకాపల్లి వైపు లారీలో తరలిస్తున్నారు. లారీ టైరు పేలిపోవడంతో వేగంగా వెళుతున్న లారీ ఒక్కసారిగా తిరగబడిపోయింది. వరి పొలాల్లోకి బండరాళ్లు జారిపడ్డాయి. ఈ రోడ్డు మార్గంలో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తూ ఉంటాయి. లారీ రెండు మూడు ఆటోలు తప్పించిన తర్వాత తిరగబడడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. రెప్పపాటులో కొన్ని వాహనాలు లారీని దాటుకుని వెళ్లిన తరువాత ప్రమాదం చోటు చేసుకోవడంతో పెను ప్రమాదం తప్పింది. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. కొద్దిసేపు వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది.

నూకాలమ్మ, తాళ్లమ్మ ఆలయాల వార్షికోత్సవం

ప్రజాశక్తి-యలమంచిలి టౌన్ : మండలంలోని పోతిరెడ్డిపాలెం గ్రామంలో గ్రామ దేవతలు నూకాలమ్మ, తాళ్లమ్మ తల్లి ఆలయాల రెండో వార్షికోత్సవం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా మధ్యాహ్నం అన్నసమారాధన కార్యక్రమం ఏర్పాటు చేశారు. పెద్ద ఎత్తున స్వాములు, భక్తులు, ప్రజలు పాల్గొని ప్రసాదాలు స్వీకరించారు. నిర్వాహకులు, గ్రామ సర్పంచ్ ఇత్తంశెట్టి సన్యాసి నాయుడు పాల్గొన్నారు.

రేపు పలు మండలాల్లో విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి-మునగపాక : మండలంలోని చూచుకొండ గ్రామ సబ్ స్టేషన్ మరమ్మతులు చేపడుతున్న కారణంగా 21వ తేదీన విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు ఎస్.రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు చూచుకొండ, గణపర్తి, పల్లవు ఆనందపురం, కుమారపురం, రామగిరి, నరేంద్రపురం గ్రామాల్లో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

కశింకోట : మండలంలో నర్సింగబిల్లి సబ్ స్టేషన్ మెయింటెనెన్స్ పనులు కారణం గా శుక్రవారం ఉదయం 8 నుండి మధ్యాహ్నం 2 గంటల విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని కశింకోట ఈఈ రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరిధిలోని నరసింగపల్లి, జె.తుని, చింతలపాలెం, గొబ్బూరు, తాళ్లపాలెం, బంగారయ్యపేట, ఉగ్గిన పాలెం, పరవాడపాలెం, జమాదులపాలెం గ్రామాలకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

అనకాపల్లి : మండలంలోని కొత్తూరు 33/11కేవీ సబ్ స్టేషన్ మెయింటెనెన్స్ వర్క్ కారణంగా ఈనెల 21న ఉదయం 8 నుండి సాయంత్రం 6 వరకు కొత్తూరు సెక్షన్ పరిధిలోని సంపతిపురం, చిన్నసంపతిపురం, వేటజంగాలపాలెం, వెంకుపాలెం, సత్యనారాయణపురం, కూండ్రం, కుంచంగి, కొత్తూరు గ్రామాలకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు.

సబ్బవరం : మండలంలోని సబ్బవరం, అంతకాపల్లి సబ్ స్టేషన్స్ పరిధిలో మెయింటెనెన్స్ వర్క్ కారణంగా ఈనెల 21న ఉదయం 9 నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు.

డ్వాక్రా సంఘాలకు విఒఎల టోకరా

-బ్యాంకుల నోటీసులతో బయటపడ్డ అక్రమాలు

-లబోదిబోమంటున్న బాధిత గిరిజనులు

ప్రజాశక్తి -మాడుగుల:అభం శుభం తెలియని గిరిజన డ్వాక్రా సంఘాల మహిళలకు ఇద్దరు వీవోఏలు టోకరా వేశారు. వారి అమాయకత్వాన్ని ఆసరాగా తీసుకొని బ్యాంకు రుణాలు పొంది వారిద్దరు లక్షలాది రూపాయలు స్వాహా చేశారు. ఈ విషయం లేటుగా వెలుగులోకి రావడంతో వారు పరారీ అయ్యారు.

వివరాల్లోకి వెళితే.. మాడుగుల మండలంలోని అవురువాడ పంచాయతీ ఏ.వీరనారాయణంలో 22 సంఘాలకు వీవోఏగా రావాడ కొండలరావు, తుమ్మవానిపాలెంలో 21 గ్రామాఖ్య సంఘాలకు వీవోఏగా రావాడ దేముడమ్మ (భార్యాభర్తలు) పని చేస్తున్నారు. వీరిద్దరు డ్వాక్రా సంఘాలకు సంబంధించిన అన్ని వ్యవహారాలు చూస్తు . వీరిపై డ్వాక్రా మహిళలకు నమ్మకం కలిగేలా చూసుకున్నారు. దీంతో, వారి బ్యాంకు పుస్తకాలు, మినిట్స్ పుస్తకాలు, అప్పులకు సంబంధించిన పుస్తకాలు స్టాంపులు అన్నీ ఇద్దరి వీవోఏల వద్దే ఉండేవి. వారిద్దరి పై డ్వాక్రా మహిళలు నమ్మకం పెంచుకున్నారు. చివరకు వారు ఎక్కడ వేలుముద్రలు పెట్టమంటే అక్కడ పెట్టేసే వారు. ఇదే అదునుగా భావించిన ఆ ఇద్దరు వీవోఏలు 2019 నుంచి డ్వాక్రా మహిళలకు తెలియకుండా తీర్మాణాల్లో సంతకాలు చేయించి వారి పేరున బ్యాంక్ లింకేజి, స్త్రీనిధి, సీఐఎఫ్, ఉన్నతి, హెచ్ఎ వంటి రుణాలు మంజూరు చేయించుకొని కాజేయడం మొదలుపెట్టారు. ఆ రుణాలకు సంబంధించి అప్పటి సీసీ ఆ సమయంలో అనుమానం రాకుండా అంచెలంచెలుగా కొంతమేర కట్టుకు వచ్చారు. సీసీ అప్పలనాయుడు బదిలీపై 2024 సెప్టెంబరు నెలలో వెళ్లిపోయారు. అప్పటి నుంచి బ్యాంకుకు నగదు జమ కాలేదు. దీంతో బ్యాంకర్లు డ్వాక్రా సంఘాలకు నోటీసులు జారీ చేశారు. వీవోఏలు డ్వాక్రా గ్రూపులతో నిర్వహించే సమావేశాలు, ఆర్థిక లావా దేవీలు, రుణాలు, ప్రభుత్వం అందించే పథకాల గురించి సభ్యులకు అవగాహన కల్పించే విషయంలో సీసీల పర్యవేక్షణ ఉండాలి. అది లేకపోవడంతో ఉన్న 43 గ్రూపుల్లో 35 గ్రామాఖ్య సంఘాల మహిళల పేరిట రూ. 50లక్షల రుణాలు కాజేశారు. వీటిలో కొన్ని గ్రూపులకు సంబంధించి నగదు రికవరీ చేయగా, మిగిలిన గ్రూపుల సొమ్ముని పట్టుకొని ఆ ఇద్దరి వీవోఏలు పరారయ్యారు.

అంతే కాకుండా మండలంలో సీతబందల, కాగిత, పెదగొర్రిగెడ్డ, తుమ్మవానిపాలెం గ్రామాలకు చెందిన అమాయకులకు మాయ మాటలు చెప్పి గృహాలు, భూములపై రుణాలు, తాకట్టుకి డబ్బులు ఇప్పిస్తా మని నమ్మించి సుమారు రూ.20లక్షల వరకు కాజే శాడని బాధితులు లబోదిబోమంటున్నారు.

సిసి పర్యవేక్షణ లేకనే కాజేశారు

వీవోఏలు డ్వాక్రా సభ్యులకు సక్రమంగా రుణాలు మంజూరు చేయిస్తున్నారా..ఆ రుణాలు తిరిగి వసూలు చేస్తున్నారా.. సమావేశాలు తరచూ నిర్వహిస్తున్నారా అని సీసీ పర్యవేక్షించాలి. పర్యవేక్షణలో లోపంతోనే డ్వాక్రా మహిళలు మోస పోయారు.ఎప్పటికప్పుడు గ్రూపులో సభ్యులందరిని పిలిచి సమావేశాలు నిర్వహించాలని సూచిస్తున్నా నిర్లక్ష్యంగా ఉంటున్నారు. ఇదే కాకుండా స్థానికంగా లేని వారు కూడా గ్రూపుల్లో ఉండడంతో సమస్యలు తలెత్తుతున్నాయి. ఇకపై డ్వాక్రా గ్రూపులో ఉన్న ప్రతి సభ్యురాలు నెల నెలా నిర్వహించే సమావేశానికి హాజరు కావాలి. సభ్యులు సమావేశాలకు రాకపోవడంతోనే లక్షలాది రూపాయలు వీవోఏలు కాజేశారు. దానికి సంబంధించి అన్ని రికార్డులు పరిశీలిస్తున్నాం. ఆ ఇద్దరు వీవోఏలు నగదు కాజేసి ఉడాయించారు. వారిద్దరుని విధుల నుండి తొలగించి కొత్తవారిని నియమించడం జరుగుతుంది. అన్ని కోణాల్లో విచారించి వారిపై చర్యలు తీసుకుంటాం.

రమణికుమారి

వెలుగు ఎపిఎం

డ్వాక్రా రుణాల సొమ్ము స్వాహా పై విచారణ

ప్రజాశక్తి- మాడుగుల:మండలంలో అవురువాడ పంచాయతీ పరిధిలో గ్రామ సమాఖ్య సంఘాల డ్వాక్రా రుణాలు స్వాహా చేసిన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని అనకాపల్లి జిల్లా డిఆర్డిఏ ప్రాజెక్ట్ అధికారిని సచిదేవి అధికారులను ఆదేశించారు. డ్వాక్రా మహిళల సొమ్ము వివోఏలు కాజేసిన విషయమై పత్రికలలో రావడంతో స్పందించిన అధికారులు బుధవారం మాడుగుల వచ్చి రుణాలకు సంబంధించి బ్యాంకులు లావాదేవీలను ఆమె పరిశీలించారు. అనంతరం ఆవురువాడ పంచాయతీ ఏ.వీరనారాయణ, తుమ్మవాణిపాలెం గ్రామాలకి వెళ్లి గ్రామ పెద్దల సమక్షంలో మహిళలతో మాట్లాడారు. జరిగిన సంఘటనను మహిళలు వివరించారు. దీనికి సంబంధించి పోలీసులకు ఫిర్యాదులు చేయండి అని, అధికారుల నుండి కూడా ఫిర్యాదులు చేయిస్తామని తెలిపారు. వివోఏలు డ్వాక్రా మహిళలతో సమావేశాల నిర్వహించి ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని,

విచారణ చేపడుతున్న డిఆర్‌డిఒ ప్రాజెక్ట్ అధికారిణి

దీనికి సంబంధించి పర్యవేక్షణ సీసీలకు ఉండాలన్నారు. ఈ విధంగా జరగకపోవడంతో డ్వాక్రా మహిళలు మోస పోయారన్నారు. ప్రతి నేలాల డ్వాక్రా సంఘాల సమావేశాలు నిర్వహించి ప్రతి ఒక్క సభ్యురాలు వచ్చే విధంగా చూడాలన్నారు. గ్రామాల్లో లేకుండానే డ్వాక్రాలో ఉన్న సభ్యులను గ్రూప్ సభ్యుల తీర్మానంతో తొలగించే చర్యలు తీసుకోవలసిన అవసరం ఎంతైనా ఉందని డిఆర్డిఏ ప్రాజెక్ట్ అధికారిని సచిదేవి పేర్కొన్నారు.

గ్రంథాలయాల్లో విద్యార్థులకు పోటీలు

ప్రజాశక్తి -మాడుగుల:58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా బుధవారం మాడుగుల, కెజె పురం గ్రంథాలయాలలో ముందుగా మహిళా దినోత్సవం సందర్భంగా మాజీ ప్రధాని ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలు మాడుగుల గ్రంథాలయ అధికారి ఎడ్ల వెంకటేశ్వరరావు, కేజాపురం గ్రంథాలయ అటెండర్ వి శృతి ఆధ్వర్యంలో జరిగాయి.

నర్సీపట్నం: దేశాభివృద్ధిలో మహిళలు కీలక భూమిక పోషిస్తున్నారని నర్సీపట్నం రూరల్ సిఐ రేవతమ్మ అన్నారు. శాఖ గ్రంథాలయంలో ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా గ్రంథాలయ అధికారి దమయంతి ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులకు వ్యాస రచన పోటీలు, అనంతరం ముగ్గుల పోటీలు నిర్వహించారు.

గొలుగొండ:గొలుగొండ శాఖ గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు సందర్భంగా గ్రంథాలయాధికారి వరలక్ష్మి ఆద్వర్యంలో మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతిని నిర్వహించారు. స్థానిక పాఠశాలలో బాలికలకు రంగవల్లులు పోటీలు నిర్వహించారు.

రోలుగుంట:రోలుగుంట శాఖ గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బుధవారం క్విజ్ పోటీలు నిర్వహించారు. క్విజ్ పోటీలను విశ్రాంత గ్రేడ్ వన్ గ్రంథ పాలకుడు మురళీకృష్ణ నిర్వహించారు. గ్రంథాలయాధికారి రాజబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు.

కశింకోట : మండలంలోని తాళ్ళపాలెం శాఖా గ్రంథాలయంలో రంగవల్లి, మ్యూజికల్ చైర్ పోటీలు నిర్వహించారు. ఉపాధ్యాయులు బి.శ్రీదేవి, భార్గవి విద్యా

గొలుగొండలో...

కోటవురట్లలో పాల్గొన్న విద్యార్థులు

మందిర్ టీచర్ ఎ.రమాదేవి, పిఇటి కె.నాగమణి, గాయత్రి స్కూల్ పిడి వి.రాము, గ్రంథాలయాధికారి కె.జగన్నాథం పాల్గొన్నారు.

చోడవరం : స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. తెలుగు అధ్యాపకులు రామయ్యరెడ్డి, ఇన్‌ఛార్జి గ్రంథాలయాధికారి జోగేశ్వరి పాల్గొన్నారు.

కోటవురట్ల : స్థానిక శాఖ గ్రంథాలయ అధికారి అప్పలనాయుడు ఆధ్వర్యాన రంగవల్లి పోటీలు నిర్వహించారు, ప్రభుత్వ పాఠశాల, బాలికల పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

పాయకరావుపేట : స్థానిక శాఖ గ్రంథాలయంలో మాజీ ప్రధాని ఇందిరా గాంధీ, ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి సందర్భంగా నివాళులర్పించారు. వై.అచ్యుతా, ఎస్.సీతారామ్మూర్తి, అచ్యుతరావు, గ్రంథాలయ ఇన్‌ఛార్జి లక్ష్మణరావు పాల్గొన్నారు.

సబ్బవరం : స్థానిక శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయం అధికారి వి.శిరీష ఇందిరాగాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు ఆనంద్, దివాకర్, రమాదేవి పాల్గొన్నారు.

అనకాపల్లి : ప్రసిద్ధ రచయిత శంకరమంచి సత్యం రచించిన అమరావతి కథలు మానవ విలువలకు నిలువుటద్దంగా నిలుస్తాయని తుమ్మపాల జడ్పీహెచ్ స్కూల్ హిందీ పండిట్ జగన్మోహన్ అన్నారు. తుమ్మపాల శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ ఎం.పద్మావతి అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో జగన్మోహన్ 'అమరావతి కథలు'పై ఆహ్లాదకరమైన పరిచయం అందించారు. ఆళ్ల గోవిందరావు, పెతకంకంశెట్టి బలరాం, బొడ్డపాటి రాజారావు, ఎరుబండి సత్యనారాయణ పాల్గొన్నారు.

అనకాపల్లి : స్థానిక శాఖా గ్రంథాలయంలో అనకాపల్లి సాహితీమిత్రుల ఆధ్వర్యంలో సాహితీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో శారదా గ్రంథాలయం అధ్యక్షులు కోరుకొండ బుచ్చిరాజు, జిల్లా గ్రంథాలయాల కార్యదర్శి బుర్రి కుమారరాజు, గ్రంథాలయాధికారి కె.శ్రీనివాసరావు, కోరాడ అప్పలరాజు కవిసమ్మేళనం నిర్వహించారు.

నక్కపల్లి:మండలంలో చినదొడ్డిగల్లు గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గ్రంథాలయ అధికారి జనార్ధన్ ఆధ్వర్యంలో బుధవారం మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు లక్ష్మీ ప్రసన్న, కే సునీత, పిడి షహనాజ్ ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. నక్కపల్లి గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి గోవిందేశ్వరరావు ఆధ్వర్యంలో ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు పాటల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయు రాలు సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

ములగాడ : మేల్కాపురం శాఖా గ్రంథాలయంలో మహిళా దినోత్సవ సదస్సు నిర్వహించారు. సెయింట్ ఆన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ ప్రేమకుమారి జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సిస్టర్ క్యాస్లిన్, ఇ.పిఎస్.భాగ్యలక్ష్మి, వై. అనసూయ దేవి, ముస్తారి బేగం, డాక్టర్ అంబేద్కర్ రాజు, గ్రంథాలయాధికారి వి. అజయ్ కుమార్ పాల్గొన్నారు.

భీమునిపట్నం : స్థానిక శాఖా గ్రంథాలయంలో బుధవారం మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని నిర్వహించారు. వివిధ రంగాల్లో ప్రతిభ చూపించిన పలువురు మహిళలను సన్మానించారు లైబ్రేరియన్ మహేష్, ప్రభుత్వ ఆసుపత్రి దంత వైద్యులు సురేఖ బెహరా, యునాని వైద్యులు ప్రతిభ, క్రీడాకారిణి లావణ్య, విశ్రాంత ఉపాధ్యాయులు డి ఈశ్వర రావు, వర్మ, కె సన్యాసినాయుడు, మాజీ కౌన్సిలర్ మైలపల్లి లక్ష్మణరావు పాల్గొన్నారు .

పంచాయతీ భవనాలకు నిధుల మంజూరు

-నర్సీపట్నం డివిజనల్ ఇంజనీర్ ఈశ్వరరావు

ప్రజాశక్తి -నర్సీపట్నం: ఇటీవల కొత్తగా ఏర్పడిన నూతన పంచాయతీ భవనాలకు నిధులు మంజూరు అయినట్లు నర్సీపట్నం డివిజనల్ ఇంజనీర్ ఈశ్వరరావు తెలిపారు. ఒక్కో పంచాయతీ భవనానికి రూ.32 లక్షల చొప్పున నాలుగు మండలాలకు 14 భవనాలు మంజూరయ్యాయని తెలిపారు. మాకవరపాలెం మండలంలో పెద్దిపాలెం, మామిడిపాలెం, మల్లవరం, కేతుటిపాల, బిఎస్ పేట, ముసిడి పాలెం, చామంతి పురం, నర్సీపట్నం మండలానికి కే.లక్ష్మీపురం, దుర్గాడ, గోలుగొండ మండలం చెన్నయ్యపాలెం గ్రామానికి, నాతవరం మండలం సుందరకోట, వైబి పట్నం గ్రామాలకు పంచాయతీ భవనాలను ఉపాధి హామీ నిధుల ద్వారా నామినేషన్ పద్ధతిలో నిర్మాణాలు చేపడతామన్నారు.

సరుకులు ఇస్తున్న లోవరాజు

నిత్యావసర సరుకులు వితరణ

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని మేజర్ పంచాయతీ ఏఎల్.పురంలో మాజీ పారిశుద్ధ్య కార్మికుడు పెదపూడి ఎర్నియ్య(రాజు) అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకొని రానున్న పంచాయతీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటి చేయనున్న బేరా లోవరాజు ఆ కుటుంబానికి నిత్యావసర సరుకులు అందించారు. బుధవారం ఎర్నియ్య కుటుంబ సభ్యులకు 25 కేజీలు బియ్యం కూరగాయలు, నూనె వంటి నిత్యావసర సరుకులు అందించారు. ఈ సందర్భంగా బేరా లోవరాజు మాట్లాడుతూ, ఏఎల్.పురం గ్రామంలో పలు సేవా కార్యక్రమాలు చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నానని ఆయనన్నారు. తాను ఎల్లప్పుడూ ప్రజాసేవ చేసేందుకు ముందు ఉంటానని బేరా లోవరాజు తెలిపారు.

ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలో గొడిచెర్ల జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు సత్య కుమార్ బుధవారం తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి విశాఖ జిల్లా కణితి హైస్కూల్‌లో ఈనెల 18న జరిగిన అండర్ -14 బాలికల విభాగంలో గొడిచెర్ల ఉన్నత పాఠశాలకు చెందిన 6 గురు విద్యార్థులు కావ్య, దివ్య శ్రీ, అభినందిని, దివ్య సంపూర్ణ, జ్యోషిక, సత్యవాణి లు జిల్లా స్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో పాల్గొని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులు అన్నమయ్య జిల్లా, కనిగిరిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ ఎం లోవకృష్ణ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నర్సింగ్ రాజ్, దివ్య తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న సిఐటియు నేతలు, కార్మికులు

మధ్యాహ్న భోజన బకాయిలు విడుదల చేయాలి

ప్రజాశక్తి- నర్సీపట్నం: మధ్యాహ్న భోజన పథకంలో పెండింగ్ బిల్లులు, వేతనాలు తక్షణమే విడుదల చేయాలని సిఐటియు నాయకులు ఈరెల్లి చిరంజీవి డిమాండ్ చేశారు. మండలంలోని వేములపూడిలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనం పథకం నిర్వాహకులు ప్రసన్న మాట్లాడుతూ, వడ్డీకి అప్పులు తెచ్చి వంటలు చేసి వడ్డించాల్సిన పరిస్థితి నెలకొందని ప్రభుత్వం వెంటనే నిధులు చేయాలన్నారు. అదేవిధంగా కార్మికులకు నెలకు రూ.10000 చొప్పున వేతనాలు చెల్లించాలని కార్మికులకు గుర్తింపు కార్డులతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

కుర్చీలు అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

గ్రంథాలయానికి 10 కుర్చీలు వితరణ

ప్రజాశక్తి-నక్కపల్లి: మండలంలో చినదొడ్డిగల్లు గ్రంథాలయానికి యూత్ రాక్స్ యాక్టివ్ బాయ్స్ హెల్పింగ్ హాండ్స్ ట్రస్ట్ తరపున 10 కుర్చీలు బహూకరించారు. బుధవారం కుర్చీలను గ్రంథాలయ అధికారి జనార్ధన్‌కు ట్రస్ట్ సభ్యులు అందజేశారు. ఈ మేరకు ట్రస్ట్ సభ్యులకు గ్రంథాలయ అధికారి జనార్ధన్ అభినందనలు తెలియజేశారు.

రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి- రావికమతం: మండలంలో టి. అర్జపురం నుంచి చినపాచీల వరకు బి.యన్ రోడ్డు పనులను రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ రాజనకొండ నాయుడు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ రోడ్డు నిర్మాణానికి ఇటీవల నాబార్డు నుంచి 6.90 కోట్ల రూపాయలు నిధులు మంజూరయ్యాయన్నారు. ఈ రోడ్డు 13.7 కిలోమీటర్లు పొడువున తారు రోడ్డు నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా ఈ పనులు ఇంతవరకు నత్త నడకన సాగాయని తెలిపారు. చోడవరం శాసనసభ్యులు కేఎస్ఎన్ఎస్ రాజు చొరవతో పనులు ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో రౌతు సత్తిబాబు, మచ్చా శ్రీనివాసు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులకు ప్రణాళికలు

ఎపిడి మణి కుమార్

ప్రజాశక్తి-రావికమతం: 2025-26 ఏడాదికి సంబంధించి ఉపాధి హామీ పనుల గుర్తింపు ప్రక్రియ గ్రామ సభల ద్వారా సత్వరమే పూర్తి చేయాలని ఏపీడి మణికుమార్ తెలిపారు.మండల కేంద్రం ఉపాధి హామీ కార్యాలయంలో బుధవారం ఉపాధి హామీ సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఏ పి డి మాట్లాడుతూ, ఉపాధి శ్రామికుల ఈ కేవైసీ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని, గ్రామ సభల ద్వారా గుర్తించిన పనులను యుక్త ధార యాప్ ద్వారా అప్లోడ్ చేయాలని తెలిపారు. ప్రస్తుతం ఉపాధి హామీ పథకం ద్వారా ఫారంపాండ్స్, సోఫిట్స్, పంటకాలువలు, పశువుల షెడ్ల నిర్మాణాలు, హౌసింగ్ తదితర పనులను వేగవంతం చేయాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ చిన్నారావు, ఈసీ ఉమాశంకరు, టి.ఏ బైరాగి, ఆసరయ్య, నూకరాజు పలువురు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) 25వ రాష్ట్ర మహాసభలు డిసెంబర్ 12, 13, 14 తేదీలలో తిరుపతిలో జరుగుతున్నాయని, ఈ మహాసభలను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు పి.రామ్మోహన్ పిలుపునిచ్చారు. జగదాంబ సమీపంలోని సిఐటియు కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో మహాసభలకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యను ప్రైవేటీకరణ చేసే దిశలో పనిచేస్తుందన్నారు. యూనివర్సిటీలో అధ్యాపకుల పోస్టులు చాలాకాలంగా ఖాళీగా ఉన్నప్పటికీ భర్తీ చేయడం లేదన్నారు. బడుగు బలహీన వర్గాల విద్యార్థులు ఉండే హాస్టళ్ల పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. మహాసభలో భాగంగా డిసెంబర్ 12న తిరుపతిలో వేలాదిమంది విద్యార్థులతో భారీ ర్యాలీ, అనంతరం బహిరంగ సభ జరుగుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎల్‌జె.నాయుడు, జిల్లా అధ్యక్షులు డి.వెంకటరమణ, ఎస్ఎఫ్ఐ ఆంధ్ర యూనివర్సిటీ కార్యదర్శి కుసుమాంజలి, జిల్లా సహాయ కార్యదర్శి నరేష్, ఆర్.నిఖిల్, పి.ప్రగతి, భరత్ పాల్గొన్నారు.

మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

21 నుంచి కనకమహాలక్ష్మి మార్గశిర మాసోత్సవాలు

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఇఒ శోభారాణి తదితరులు

ఇఒ కె.శోభారాణి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : శ్రీ కనక మహాలక్ష్మి అమ్మవారి మార్గశిర మాసోత్సవాలను ఈ నెల 21వ తేదీ నుంచి నిర్వహిస్తామని దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, దేవస్థానం కార్యనిర్వహణాధికారి కె.శోభారాణి తెలిపారు. బుధవారం దేవస్థానం ఆవరణలోని అన్న ప్రసాద భవనంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ఈ మార్గశిర మాసోత్సవాలు ఈ నెల 21 నుంచి డిసెంబర్ 19వ తేదీ వరకు సంప్రదాయ బద్ధంగా జరుపుతామన్నారు. డిసెంబర్ 7వ తేదీన 6.30 గంటలకు వేద సభ అర్చక సదస్సు, 13వ తేదీ సాయంత్రం 4 గంటల నుంచి రథ యాత్ర, 18వ తేదీ మధ్యాహ్నం 12 గంటల నుంచి మహా అన్నదానం, అదే రోజు సాయంత్రం 4 గంటలకు సహస్ర ఘటాభిషేకం తదితర వైదిక కార్యక్రమాలు జరుపుతామని తెలిపారు. ఈ కార్యక్రమాలకు వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని తగిన విధంగా ఏర్పాట్లు చేశామన్నారు. మీడియా సమావేశంలో విశాఖ జిల్లా సమాచార శాఖాధికారి సదారావు, జిల్లా సహాయ సమాచార అధికారి నారాయణ రావు, దేవస్థానం సహాయ కార్యనిర్వహణాధికారి రాజేంద్ర కుమార్, దేవస్థానం పురోహితులు, సిబ్బంది పాల్గొన్నారు.

చెత్త రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలి

ప్రజాశక్తి -నక్కపల్లి: పంచాయతీల సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజల భాగస్వామ్యంతో చెత్త రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని ఎంపీడీఓ బి చైతన్య అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సుస్థిర అభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణ పై శిక్షణ ఇచ్చారు. ముందుగా ఎంపీడీఓ చైతన్య మాట్లాడారు. పరిశుభ్రం -పచ్చదనంపై అవగాహన కల్పించారు. గ్రామాలు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంటే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారన్నారు. పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో ప్లాస్టిక్ వాడకాన్ని నివారించి, ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలన్నారు. ప్లాస్టిక్ వాడకంతో కలుగు అనర్థాలు గురించి వివరించారు. పంచాయతీ కార్యదర్శులు నరసింహరాజు, శ్రీనివాస్ ట్రైనీలుగా వ్యవహరించి మాట్లాడారు. ఇంటింటా తడి పొడి చెత్త సేకరణ పై అవగాహన కల్పించారు. ఉద్దండపురం సర్పంచ్ పొడగట్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు స్థలం లేకపోవడంతో గ్రామంలో సేకరించిన చెత్తను వేసేందుకు ఇబ్బందులు పడుతున్నామన్నారు. పారిశుద్ధ్య నిర్వహణ మరింతగా మెరుగుపరిచేందుకు సరిపడే పారిశుద్ధ్య కార్మికులను నియమించక పోవడంతో ఇబ్బందులు తప్పలేదన్నారు. ఏవో డి.సీతారామరాజు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిడి చైతన్య

మాదక ద్రవ్యాలకు నో చెప్పండి

సైకిల్ ర్యాలీలో పరవాడ డిఎస్‌పి విష్ణు స్వరూప్

సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది

ప్రజాశక్తి-పరవాడ : మాదక ద్రవ్యాలకు యువత నో చెప్పాలని పరవాడ డిఎస్‌పి వి.విష్ణు స్వరూప్ అన్నారు. మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కల్పించడానికి చేపట్టిన సైకిల్ ర్యాలీ బుధవారం ఉదయం 10 గంటలకు లంకెలపాలెం జంక్షన్‌కు చేరుకుంది. పోలీసులు, విద్యార్థులు, ప్రజలు కలిసి నిర్వహించిన డ్రగ్స్ వ్యతిరేక సైకిల్ ర్యాలీకి విశేష స్పందన లభించింది. కార్యక్రమాన్ని ప్రారంభించిన డిఎస్‌పి విష్ణు స్వరూప్ మాట్లాడుతూ "డ్రగ్స్, గంజాయి వంటి మాదకద్రవ్యాలు యువత భవిష్యత్తును నాశనం చేసే ప్రమాదకర వ్యసనాలని, వాటికి దూరంగా ఉంచాలని కోరారు. అనంతరం ఆయన స్వయంగా 25 మంది సైక్లిస్టులతో కలిసి 7 కిలోమీటర్ల సైకిల్ ర్యాలీలో పాల్గొని సందేశాన్ని అందించారు. కార్యక్రమంలో పరవాడ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.వినోద్ బాబు, జేఎన్పిసి ఎంఏ సెక్రటరీ జెట్టి సుబ్బారావు, వైస్ ప్రెసిడెంట్ ఎన్.సూర్య ప్రకాశరావు, లంకెలపాలెం జెడ్‌పి హైస్కూల్ హెచ్ఎం ఆర్.నాగేశ్వరరావు, ఈఓఆర్డి మురళీ పట్నాయక్, గొన్నా కాలేజ్ కరస్పాండెంట్ హేమచంద్ర, ఇన్‌స్పెక్టర్ ఆర్.మల్లికర్జునరావు, వుమెన్స్ ఎస్సై మహాలక్ష్మి, ట్రైనీ ఎస్సై విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం : మాదకద్రవ్యాల వల్ల వచ్చే సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు పోలీస్ శాఖ చేపట్టిన సైకిల్ ర్యాలీ బుధవారం సబ్బవరానికి చేరింది. స్థానిక మూడు రోడ్ల జంక్షన్లో సైకిల్ ర్యాలీ బృందానికి సబ్బవరం సీఐ జి.రామచంద్రరావు స్వాగతం పలికారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ పరదేసిరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

యస్.రాయవరం : చదువుకునే వయస్సులో మత్తు మాదకద్రవ్యాలకు అలవాటు పడితే జీవితాలు నాశనమవుతాయని నక్కపల్లి రూరల్ సిఐ లొడ్డు రామకృష్ణ అన్నారు. బుధవారం ఉదయం మండలంలో కొరుప్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థులతో జరిగిన అవగాహనా సమావేశంలో ఆయన మాట్లాడారు. మత్తు పదార్థాల వలన కుటుంబంలోనూ, సంఘంలోనూ గౌరవ మర్యాదలు పోతాయన్నారు. కార్యక్రమంలో స్థానిక యస్ఐ ఏ విభీషణరావు, ప్రధానోపాధ్యాయులు కప్పల ప్రసాద్, పడాల నానాజీ మాస్టర్, సకురు సత్యనారాయణ మాస్టర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న సిఐ రామకృష్ణ

అసంపూర్తిగా సచివాలయ భవన నిర్మాణం

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి మండలం తుమ్మపాల మేజర్ పంచాయతీ సచివాలయం-2 భవన నిర్మాణం గత మూడేళ్లుగా అసంపూర్తిగా ఉండిపోయింది. తాత్కాలికంగా తుమ్మపాల సచివాలయం-2 కళావేదిక వెనుక ఉన్న చిన్నగదిలో నిర్వహిస్తున్నారు. కనీసం 10 మంది వస్తే కూర్చోలేని పరిస్థితుల్లో సచివాలయానికి వచ్చే వారు ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వంలో సచివాలయం-2 భవనాన్ని ప్లాస్టింగ్‌ల వరకు నిర్మాణం చేశారు. అయితే కారణాంతరాల వల్ల భవన నిర్మాణం పూర్తి చేయకుండా అసంపూర్తిగా నిలిచిపోయింది. 3 సంవత్సరాలు కావస్తున్నా పూర్తికాలేదు. ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి తక్షణమే ఈ భవనాన్ని పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు. ప్రస్తుతం ఆ భవనం చెత్త చెదరాలతో నిండి ఉంది. పంచాయతీ పాలక వర్గం పంచాయతీ నిధుల నుండి కానీ, మండల నిధులు నుండి కానీ ప్రభుత్వం వారి నిధుల నుండి కానీ ఖర్చు చేసి అసంపూర్తిగా వున్న సచివాలయం 2ను పూర్తిచేసి ప్రజల అసౌకర్యాన్ని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

అసంపూర్తిగా ఉన్న తుమ్మపాల సచివాలయం-2 భవనం